భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 30.0
కనిష్ఠం : 18.0

సక్సెస్ కోసం మెగా ప్లాన్

ఉత్సాహంగా మెగా పేరెంట్, టీచర్స్ మీట్



అతిథిలకు సాదరంగా ఆహ్వానం

మరింత బాగా చదివించాలి..

ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల చర్చ

భీమవరం రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) :విద్యార్థులు చదువులో రాణించేందుకు వారి లోపాలు చర్చించేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య సమన్వయం చేసేందుకు ఏర్పాటు చేసిన మెగా టీచర్ పేరెంట్ ఉత్సాహకరమైన వాతావరణంలో జరిగింది. సమావేశంలో విద్యాబోధనే ప్రధాన చర్చగా సాగింది. విద్యార్థుల మార్కులు, వాటిని



పన్నీరు చల్లి, పూలు ఇచ్చి స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు

మరింత పెంచేలా చేసే ప్రయత్నాలపై ప్రణాళిక ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పటికే సగం పైగా విద్యా సంవత్సరం పూర్తి కావడం, ఇక నుంచి విద్యార్థులు మరింత పట్టు సాధించి చివరి పరీక్షలలో మంచి మార్కులు సాధించేలా చర్యలు చేపట్టాలని ప్లాన్ చేసుకున్నారు. శుక్రవారం జిల్లాలో 1,375 పాఠశాలల్లో 90 వేల మంది విద్యార్థులు, తల్లిదండ్రులతో కళకళలాడాయి. ప్రజాప్రతినిధులు హాజరై విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కరాటే, ఆత్మరక్షణ ఆసనాలు వేశారు. సైన్స్‌కు సంబంధించిన ప్రాజెక్టులు రూపొందించి ప్రదర్శించారు.

• తల్లిదండ్రులపై బాధ్యత పెరుగుతుంది



పాఠశాలకు తల్లిదండ్రులను పిలిపించి మీటింగ్ పెట్టడం వల్ల తల్లిదండ్రులకు మరింత బాధ్యత అప్పగించినట్లవుతుంది. చదువు గురించి చర్చించడం వల్ల పిల్లలు ఎలా చదువుతున్నారు ? ఇంకెలా చదివించాలనే దానిపై అవగాహన కలుగుతుంది.

- నదియా, పేరెంట్, భీమవరం పీఎస్ఎం హైస్కూల్

• చాలా మంచి కార్యక్రమం



మా పాప 7వ తరగతి చదువుతుంది. మూడోసారి మీటింగ్‌కు వచ్చాను. ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధన గురించి, ఎలా చదివించాలో వివరిస్తున్నారు. ఇది మంచి విధానం.

- కరుణకుమారి, తల్లి, భీమవరం పీఎస్ఎం హైస్కూల్

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం పేరెంట్స్, టీచర్ సమావేశం ఉత్సాహకరమైన వాతావరణంలో జరిగింది. జిన్నూరు హైస్కూల్‌లో జరిగిన సమావేశంలో మంత్రి నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిందన్నారు. విద్యార్థుల్లో సత్ ప్రవర్తనకు తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు.

ఈ చిన్నోడు .. భలే స్మార్ట్

తల్లి మీటింగ్‌కు రాలేదని ఇంటికి వెళ్లిన విద్యార్థి

విద్యుత్ షాక్‌తో కొట్టుమిట్టాడుతుంటే స్విచ్ ఆపి కాపాడిన దీక్షిత్



భీమవరం మండలం జొన్నలగరువు పాఠశాలలో మెగా పేరెంట్ టీచర్ మీట్ జరుగుతోంది. సమావేశానికి 5వ తరగతి చదువుతున్న దీక్షిత్ తల్లి రాలేదు. దీంతో తల్లిని తీసుకురావడానికి దీక్షిత్ ఇంటికి వెళ్లగా తల్లి కరెంట్ వైర్ తగిలి షాక్‌తో కొట్టుమిట్టాడుతోంది. దీక్షిత్ సమయస్ఫూర్తితో వెంటనే పవర్ స్విచ్ ఆఫ్ చేశాడు. తల్లిని ప్రమాదం నుంచి రక్షించాడు. తర్వాత డాక్టర్ వద్ద ప్రథమ చికిత్స చేయించి మీగింగ్‌కు తీసుకువెళ్లాడు. సమావేశానికి తీసుకువచ్చేందుకు వెళ్లడం వల్లే దీక్షిత్ తల్లి ప్రాణాలతో బయట పడిందని అందరూ విద్యార్థిని ప్రశంసించారు.

స్క్రబ్ టైఫస్ జ్వరాలు లేవు

ప్రాణాంతకం కాదు..అప్రమత్తంగా ఉంటే చాలు

అవసరమైన మందులను సిద్ధం చేశాం

'ఆంధ్రజ్యోతి'తో జిల్లా వైద్యాధికారిణి గీతాబాయి



జిల్లాలో స్క్రబ్ టైఫస్ పురుగు కాటువల్ల వచ్చే జ్వరాలు లేవని వైద్య ఆరోగ్య శాఖ గుర్తించింది. ఉన్నతాధికారుల ఆదేశాలపై ఈ వ్యాధిపై ప్రభుత్వాసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలను అప్రమత్తం చేసింది. అవసరమైన మందులను కూడా సిద్ధం చేసింది. జిల్లాలోని పరిస్థితులపై వైద్యాధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. నల్లి పురుగు కాటు వల్ల వచ్చే జ్వరాలు, వ్యాధి నిర్ధారణ, నివారణ తదితర అంశాలపై జిల్లా వైద్యాధికారిణి గీతాబాయితో 'ఆంధ్రజ్యోతి' మాట్లాడగా వివరాలు తెలియజేశారు.

నల్లి పురుగు కుడితే గుర్తించడం ఎలా ?

- స్క్రబ్ టైఫస్ అనే నల్లిపురుగు కుట్టినచోట దద్దుర్లు ఏర్పడతాయి. మరుసటి రోజు పుండుగా మారి తరువాత నల్లరంగు పొర కూడా కనిపిస్తుంది. 10 రోజుల తరువాత జ్వరం వచ్చే అవకాశాలు ఉన్నాయి. పురుగు కుట్టినట్లుగా ముందుగానే గుర్తించినట్లయితే ఆసుపత్రికి వెళ్లి వైద్యులను సంప్రదించాలి

ఈ వ్యాధి ప్రాణాంతకమైనదా ?

- ప్రాణాంతకమైనది కాదు. సకాలంలో వైద్యం చేసుకుంటే పూర్తిగా నయం అవుతుంది. జ్వరం మూడు రోజుల వరకు తగ్గకపోతే వ్యాధిపై అనుమానించాల్సి ఉంటుంది.ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళితే రక్త నమూనాలను సేకరిస్తారు. వ్యాధి నిర్ధారణ కోసం విజయవాడలోని వీఆర్‌డీఎల్ ల్యాబ్‌కు పంపుతారు.

ముందస్తుగా ఎటువంటి చర్యలు తీసుకోవాలి?

- వ్యాధికి కారణమయ్యే పురుగులు పంటపొలాలు, ఇంటి ఆవరణలో పిచ్చిమొక్కలు ఉన్నచోట్ల నివశిస్తుంది. ఇంటి ఆవరణలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. కలుపు, పిచ్చిమొక్కలు లేకుండా చూడాలి.పురుగు కుట్టినట్లు గుర్తిస్తే ఆసుపత్రిలో చూపించుకోవాలి. మందులు వాడితే జ్వరం రాకుండానే నయమయ్యే అవకాశం ఉంటుంది. ప్రజలు గుర్తించుకోవలసిన విషయం ఏమిటంటే పురుగు కుట్టినట్లు గుర్తిస్తే తక్షణం ఆసుపత్రిలో సంప్రదించాలి.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారా ?

- ఇప్పటికే వైద్యులకు అవగాహన కల్పించాం. గ్రామాల్లో, పట్టణాల్లో ప్రజలకు అప్రమత్తతపై అవగాహన కల్పించాలని ఆదేశించాం. సిబ్బంది ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టనున్నారు.

- భీమవరం టౌన్, (ఆంధ్రజ్యోతి)

రూటు మార్చిన రేషన్ మాఫియా



రేషన్ మాఫియా జడలు విప్పుతోంది. జిల్లా నుంచి బియ్యం అక్రమంగా ఇతర జిల్లాలకు, ఆపై విదేశాలకు తరలి వెళుతోంది. రేషన్ బియ్యం రీసైక్లింగ్ కట్టడికి ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకున్నా ఫలితం కనిపించడం లేదు. ఎప్పటికప్పుడు విజిలెన్స్ అధికారులు వ్యాపారులపై దాడులు చేసి బియ్యాన్ని పట్టుకుంటున్నా వారు వెనక్కి తగ్గడం లేదు. ఫలితంగా ప్రతీ నెల టన్నుల కొద్దీ బియ్యం చెన్నై పోర్టుకు అక్కడి నుంచి విదేశాలకు ఎగుమతి అవుతోంది. రేషన్ బియ్యంలో వున్న పోషకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో విఫలం కావడమే విక్రయాలకు కారణంగా కనిపిస్తోంది.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

గోదావరి నుంచి చెన్నై పోర్టుకు ఎగుమతి

అక్కడ నుంచి విదేశాలకు ..

జిల్లాలో 40 శాతం మళ్లీ మార్కెట్‌లోకే

రీసైక్లింగ్‌కు వెనుకాడని వ్యాపారులు

భారత ఆహార సంస్థకు జిల్లాలో బియ్యాన్ని అప్పగిస్తుంటారు. ప్రభుత్వం మిల్లర్లకు లక్ష్యాలను నిర్దేశిస్తుంది. అందుకే ఇక్కడ కొద్ది మంది తప్ప మిల్లర్లు రీసైక్లింగ్‌కు సాహసించడం లేదు. అదే తూర్పు గోదావరి జిల్లాలో భారత ఆహార సంస్థకు అంతగా కేటాయించడం లేదు. దీంతో జిల్లాలో రేషన్ బియ్యాన్ని వ్యాపారులంతా అదే జిల్లాకు తరలిస్తున్నారు. జిల్లా నుంచి ప్రధాన రహదారులపై పొరుగు జిల్లాకు వెళుతున్నాయి. దీంతో అక్కడ వ్యాపారులు డెన్‌లు ఏర్పాటు చేసి జిల్లా నుంచి రేషన్ బియ్యాన్ని సేకరిస్తున్నారు. తాడేపల్లిగూడెం కేంద్రంగానే ఓ..డెన్ నడిచింది. ఇటీవల దానిపై ఉక్కుపాదం మోపారు. ఇతర జిల్లాల నుంచి వ్యాపారులు ఇక్కడకు వస్తున్నారు. రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారు.

40 శాతం పక్కదారి

జిల్లాలో ప్రతి నెలా 8,750 టన్నుల బియ్యాన్ని రేషన్ లబ్ధిదారులకు అందజేస్తున్నారు. గతంలో కేవలం ఖరీఫ్ బియ్యాన్ని ఇచ్చేవారు. ఇప్పుడు రబీలో ఉత్పత్తి అవుతున్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. వాస్తవానికి జిల్లాలో ఎక్కువగా సన్న బియ్యం వినియోగిస్తుంటారు. దీంతో రేషన్ బియ్యాన్ని అంతగా ఉపయోగించడం లేదు. ప్రతి నెలా 40 శాతం రేషన్ బియ్యం మార్కెట్‌కు తరలిపోతోంది. అంటే ప్రతి నెలా 3,500 టన్నుల బియ్యం మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. వినియోగదారులే వ్యాపారులకు అమ్ముతున్నారు. డిమాండ్‌ను బట్టి - మిగతా 8లో

ఎన్నెన్నో ఆరోగ్య పోషకాలు



గతంలో రేషన్ బియ్యం ముతగ్గా.. రాళ్లు, బెడ్డతో ఉండేవి. అందువల్ల వాటిని తినడానికి ఇష్టపడేవాళ్లు కాదు. కానీ ఇప్పుడు ప్రభుత్వం నాణ్యమైన బియ్యాన్ని ఇస్తోంది. వీటిని లబ్ధిదారులకు ఉచితంగా ఇవ్వడానికి ప్రభుత్వం కిలోకు రూ.46 భరిస్తోంది. రవాణా, నిర్వహణ చార్జీలతో కలిపి రూ.50 అవుతుంది. బియ్యంలో నూక, రాళ్ల వంటి వాటిని నివారించడానికి సార్టెక్స్ మిషన్లను వాడుతోంది. దీంతో గతంలో 25 శాతం నూక ఉంటే ఇప్పుడు 15 శాతం, పాడైన, రంగు మారిన బియ్యం మూడు నుంచి 1.5 శాతానికి పరిమితమయ్యాయి. ఆరోగ్యపరంగా మేలు చేయడానికి మైక్రో న్యూట్రియంట్స్ కలిగిన కెర్నెల్స్‌ని కలుపుతున్నారు. రేషన్ బియ్యంలో బాగా తెల్లగా కనబడేవి ఇవే. పిల్లలు, మహిళల్లో రక్తహీనతకు చెక్ పెట్టడానికి ఐరన్, నరాలు, మెదడు చురుగ్గా పని చేయడానికి, రక్తం తయారు కావడానికి విటమిన్ బి-12, మహిళల ఆరోగ్యానికి ఫోలిక్ యాసిడ్ వంటి వాటితో కూడినవి ఈ కెర్నెల్స్. వీటిని ప్లాస్టిక్ బియ్యం అనే అపోహలో జనం ఉండిపోయారు. వీటిపై అవగాహన కల్పించడంలో ఆ శాఖలు విఫలమవుతున్నాయి. దీంతో కిలో రూ.20లకు దుకాణం వద్ద విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.ఎంత లాస్ అన్నది ఆలోచించడం లేదు.



వాహనాన్ని సీజ్ చేసిన విజిలెన్స్ అధికారులు

పీడీఎస్ బియ్యం పట్టివేత

రూ. 5 లక్షల విలువైన బియ్యం స్వాధీనం..

మూడు వాహనాలు సీజ్

పెనుమంట్ర, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పెనుమంట్ర మండలం ఆలమూరులో శుక్రవారం తెల్లవారుజామున ఏకకాలంలో దాడి చేసి మూడు వాహనాల్లో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కే.నాగేశ్వరరావుకు రేషన్ బియ్యం అక్రమంగా రవాణా జరుగుతున్నట్లు వచ్చిన సమాచారం ప్రకారం ఆయన ఆదేశాల మేరకు తనిఖీ చేసినట్టు ఏలూరు విజిలెన్స్ ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. ఆలమూరు గ్రామం వద్ద ఏపీ 37డబ్ల్యూకె 2929 నంబర్ గల టాటా వ్యాను ఆపగా వ్యానులో 40 క్వింటాళ్ళ రేషన్ బియ్యం గుర్తించి, వాహనం ఓనర్, డ్రైవర్ అయిన మూరాల సతీష్‌ను ప్రశ్నించగా భీమవరానికి చెందిన తోట సురేష్ భీమవరం పరిసర ప్రాంతాల్లో కిలో రూ.20లకు కొనుగోలు చేసి వాటిని ఆలమూరుకు చెందిన గుడిమెట్ల నాగేంద్రరెడ్డికి కిలో రూ.22 కు అమ్ముతున్నట్టు తెలిపారు. రూ 1.60 లక్షల విలువ కలిగిన బియ్యం రూ.7.80 లక్షల విలువైన వాహనం వెరసి మొత్తం రూ.9 లక్షల 40వేల సొత్తును సీజ్ చేసి సతీష్, తోట సురేష్, గుడిమెట్ల నాగేంద్ర రెడ్డిలపై నిత్యావసర వస్తువుల చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. ఆలమూరు వద్ద - మిగతా 8లో

అందుబాటులో ఇసుక నిల్వలు

కలెక్టర్ నాగరాణి

భీమవరం టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు ఇసుక అందుబాటులో ఉంచేందుకు ఇంతకు ముందే ఏడు నియోజకవర్గాల్లో ఏడు ఇసుక నిల్వ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా నిర్వహిస్తున్నామని, వీటిలో 1.20 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉంచినట్టు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఇప్పటివరకు ప్రజలు 40 వేల మెట్రిక్ టన్నుల ఇసుక మాత్రమే వినియోగించుకున్నారని, ఇంకా సుమారు 80 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉందన్నారు. అవసరమైన ప్రజలు ఇసుక సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు. ఆచంటలో 1,015 మెట్రిక్ టన్నులు నిల్వ ఉండగా టన్ను ధర రూ 444 ఉందన్నారు. భీమవరంలో 6,193 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉండగా రూ.581,నరసాపురంలో 2,403 మెట్రిక్ టన్నులు ఉండగా టన్ను రూ. 581, పాలకొల్లులో 30,513 మెట్రిక్ టన్నులు ఉండగా టన్ను రూ.556లకు, తాడేపల్లి గూడెంలో 34,871 మెట్రిక్ టన్నులు ఉండగా రూ.486 లకు, తణుకులో 6,820 మెట్రిక్ టన్నులు ఉండగా రూ.306లకు, ఉండిలో 24,628 మెట్రిక్ టన్నులు ఉండగా టన్నుకి రూ. 550 చెల్లించి కొనుగోలు చేయవచ్చునని తెలిపారు. ఇసుక అక్రమ నిల్వలపై జిల్లా గనులు భూగర్భ శాఖ, రెవెన్యూ శాఖల సిబ్బంది ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి అపరాధ రుసుం విధిస్తామన్నారు. తాడేపల్లిగూడెం మండలంలో మూడు అక్రమ ఇసుక నిల్వలను గుర్తించి రెండు లక్షల రూపాయల అపరాధ రుసుం విధించామన్నారు. 51 అక్రమ ఇసుక రవాణా దారులకు రూ.23 వేలు అపరాధ రుసుం కూడా విధించామన్నారు. ఇసుకకు సంబంధించి ఏదైనా ఇబ్బందులు ఉంటే టోల్‌ఫ్రీ నెంబర్లు 99487 26040, 93914 45753 నంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.



డీఆర్‌ఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం తప్పదు

గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆంజనేయులు

భీమవరం టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలపై ఇప్పటికే పలు సందర్భాలలో మండలస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఆందోళన చేశామని సమస్యలు పరిష్కరించకపోతే మరోసారి పోరాటం తప్పదని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎం.ఆంజనేయులు తెలిపారు. శుక్రవారం సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డీఆర్‌వోకి వినతి పత్రం అందజేశారు. వీఆర్ఏలకు ఒక్క రూపాయి వేతనం పెంచలేదని పెరుగుతున్న ధరలతో చాలీచాలని వేతనాలతో ఎలా పనిచేయాలని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వేతనాలు పెంచుతామని, నామినీల సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. తండ్రి పనిచేయలేని పరిస్థితిలో ఉంటే కొడుకుతో పని చేయిం చుకుంటున్నారని, భార్య చేయలేని పరిస్థితిలో ఉంటే భర్తతో చేయించుకుంటున్నారని కనీసం మెడికల్ లీవ్ కూడా ఇవ్వకుండా వెట్టిచాకిరీ చేయించుకుంటున్న సందర్భాలు జిల్లాలో ఉన్నాయని తక్షణమే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

21న పల్స్‌పోలియో

జిల్లాలో 1,87,204 మందికి పోలియో చుక్కలు లక్ష్యం

1,315 బూత్‌ల ఏర్పాటు

భీమవరంటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పోలియో రహిత సమాజం కోసం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కసరత్తు చేస్తోంది అందులో భాగంగా ఈనెల 21న నిర్వహించే పల్స్ పోలియోపై జిల్లాలోని వైద్యాధికారులకు ప్రత్యేక సూచనలు జారీ చేసింది. నూరుశాతం లక్ష్యం చేరుకునేలా వైద్యాధికారలు కృషి చెయ్యాలని డీఎంహెచ్‌వో గీతాబాయి సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన అవగాహన శిక్షణా కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. 0 నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించుకునేలా తల్లితండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. జిల్లాలో గుర్తించిన లక్షా 87 వేల 204 మందికి పోలియో చుక్కలు వెయ్యాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం 1315 పోలియో బూత్‌లను ఏర్పాటు చేశారు. 45 మొబైల్ బూత్‌లను, 34 ట్రాన్సిస్ట్‌బూత్‌లను ఏర్పాటు చేస్తున్నారు. 5260 మంది వాక్సినేటర్లను ఏర్పాటు చేశారు. జిల్లాలో 181 రూట్‌లకు ఒక్కో వాహనాన్ని ఏర్పాటు చేశారు. గత ఏడాది 99.91 శాతం వాక్సినేషన్ కార్యక్రమం పూర్తి కాగా ఈ ఏడాది నూరుశాతం పూర్తి చెయ్యాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవిబాబు, డాక్టర్ సుధాలక్ష్మి, ధనలక్ష్మి, డాక్టర్ క్రాంతికుమార్, భావన పాల్గొన్నారు.

నేటి నుంచి సహకార ఉద్యోగుల నిరసన

ఏలూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తమ దీర్ఘకాలిక అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సహకార ఉద్యోగులు నిరసనల బాట పట్టనున్నారు. జీవో 36 అమలు చేయాలని, పెండింగ్ వేతన సవరణ, ఉద్యోగ విరమణ వయసు 62కు పెంచాలన్న డిమాండ్లపై ఉద్యోగులు తొలి రోజు శనివారం డీసీసీబీ, డీసీఎంఎస్, సొసైటీల వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరుకానున్నారు. నెలరోజుల పాటు వివిధ ఆందోళనలకు సహకార సిబ్బంది కార్యాచరణ ప్రణాళిక ప్రకటించిన విషయం తెల్సిందే. 258 సహకార సంఘాల్లో 1400 మందికి పైగా సిబ్బంది నిరసనకు సమాయత్తమవుతున్నారు.



పందిరి రాట నిలబెట్టిన ఉత్సవ కమిటీ సభ్యులు

మావుళ్లమ్మ ఉత్సవాలకు పందిరి రాట ఏర్పాటు

భీమవరం టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మావుళ్లమ్మ 62వ వార్షిక మహోత్సవాలకు శుక్రవారం ఆలయం వద్ద పందిరి రాట నిలబెట్టారు. ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లిఖార్జున శర్మ వర్తక సంఘం అధ్యక్షుడు తుటారపు ఏడుకొండలు చేత పూజలు చేయించారు. 9-45 నిమిషాలకు నీరుల్లి కూరగాయ, పండ్ల వర్తక సంఘం, మావుళ్లమ్మ ఉత్సవ కమిటీ, దేవస్థానం సభ్యులు పందిరి రాట నిలబెట్టారు. కమిటీ సభ్యులు కొబ్బరికాయులు కొట్టి పూజలు చేశారు. కొప్పుల సత్యనారాయణ (సత్తిబాబు), రామాయణం సత్యనారాయణ, నరహరిశెట్టి అబ్బులు, రామాయణం శ్రీనివాసరావు, మానే భాస్కరరావు, మానే తేజ, ఈవో బుద్ధా మహాలక్ష్మి నగేష్ పాల్గొన్నారు.

చిన్నారులకు అర్థమయ్యేలా ..

ఒకటి, రెండు తరగతులకు 62 వస్తువులతో పాఠాలు

జిల్లాలో 1,099 పాఠశాలల్లో 10,831 మందికి బోధన

భీమవరం రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఒకటి, రెండు, మూడు తరగతుల విద్యార్థులకు పుస్తక బరువు తగ్గించి సులువుగా పాఠాలు బోధించేందుకు ప్రభుత్వం కొత్త విధానాలను తీసుకువస్తున్నది. ఇప్పుడు ఒకటి, రెండు తరగతుల చిన్నారులకు 'జాదూయి పిటారా' పేరుతో 62 వస్తువుల కిట్‌లను పాఠశాలలకు అందించారు. ఆ వస్తువులతో రోజుకు గంటసేపు విద్యాబోధన అందిస్తున్నారు. జిల్లాలో 1,099 ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలకు కిట్లను పంపిణీ చేశారు. వీటి ద్వారా ఒకటవ తరగతి 5,222 చిన్నారులకు, రెండవ తరగతి 5,609 మందికి బోధన చేయనున్నారు. తెలుగు, ఇంగ్లిష్, లెక్కలకు సంబంధించిన పాఠ్యాంశాలు ఉంటాయి. పూసల చక్రం, బిల్డింగ్ బ్లాక్, జూనియర్ అబాకస్, కిచెన్ సెట్, ఆల్ఫాబెటికల్ ట్రాపింగ్ బోర్డు వంటి వస్తువులను చూపిస్తూ ఉపాధ్యాయులు బోధిస్తారు. పుస్తకాలు, బోర్డులపై కంటే వస్తువలను చూపిస్తూ వివరిస్తే విద్యార్థులకు గుర్తుంటుంది. ఈ వస్తువులతో బోధన పట్ల చిన్నారులు ఆసక్తి చూపుతున్నారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. పలురకాల బొమ్మలు కలిగిన చార్టులను పాఠశాలలకు విద్యాశాఖ అందిం చింది. ప్రతిజ్ఞ, ఖుషిలు ఉన్న సమయంలో జీవన చిత్రపటం, ఆరోగ్య సూత్రాలు తెలిపే చిత్రపటాలు ఉన్నాయి. వీటిని పాఠశాల తరగతుల్లో గోడలకు పెట్టి వీటి గురించి తెలుపనున్నారు.





వస్తువుల ఆధారంగా బోధన చేస్తున్న ఉపాధ్యాయురాలు.. పాఠశాలలో ఏర్పాటు చేసిన చార్ట్‌లు



ఇక పంచాయతీ వ్యవస్థ బలోపేతం

ఉమ్మడి పశ్చిమలో 7 డీడీవో కార్యాలయాలు ప్రారంభం

కార్యాలయంలో డీఎల్‌పీవో, డ్వామా ఏపీడీ ఇతర ఆఫీసులు



వాటర్ గ్రిడ్ పథకానికి పవన్ శంకుస్థాపన !

ఈ నెల మూడో వారంలో విజ్జేశ్వరం, పెరవలి రాక

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్

7







వాడిన విగ్రహాలు!

మహనీయుల జ్ఞాపకాలకు గురుతులు విగ్రహాలు. వీటిని చూసినప్పుడు ఆయా రంగాలకు వారు చేసిన సేవలు గుర్తుకువస్తాయి. ఇందుకు వారి జయంతి, వర్థంతులను ఎంతో ఆర్భాటంగా చేస్తాం. విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పిస్తాం. వారు చేసిన సేవలను స్మరించుకుంటాం. ఇంత వరకు బాగానే వుంది. కాని, ఆయా కార్యక్రమాలు పూర్తయిన వెంటనే ఆ విగ్రహాలను మళ్లీ ఏడాది వరకు పట్టించుకోం. వేసిన దండలు వాడిపోయినా నెలల తరబడి తొలగించం. ఏలూరు, దెందులూరుల్లోని జాతీయ నాయకులు, ప్రముఖుల విగ్రహాలను చూడండి. ఈ దండలు వేసి ఎన్నాళ్లయ్యిందో..? నివాళులు ఇలాగేనా..?

- ఫొటోగ్రాఫర్ (ఏలూరు-ఆంధ్రజ్యోతి)

శివరాత్రి ఉత్సవాలకు శ్రీకారం


ఆచంటేశ్వర స్వామి సన్నిధిలో విఘ్నేశ్వర స్వామి ఆలయానికి బియ్యం తెస్తున్న ఆలయ ఈవో, చైర్మన్

ఆచంట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):ప్రశిద్ధి చెందిన ఆచంటేశ్వరుని సన్నిధిలో వచ్చే సంవత్సరం ఫిబ్రవరిలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం స్వామి వారి సన్నిధిలో విఘ్నేశ్వరుడికి బియ్యం కట్టి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ముందుగా విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం ఈశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ఆదిమూలం వెంకట సత్యనారాయణ, ఆలయ చైర్మన్ నెక్కంటి గజేశ్వరరావు, కమిటీ సభ్యులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

కుంకుళ్లమ్మకు పంచహారతులు



ద్వారకాతిరుమల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): క్షేత్రదేవతగా కొలువుదీరిన కుంకుళ్లమ్మవారు మార్గశిర మాస శుక్ర వారం నాడు ప్రత్యేక పుష్పాలంకరణలతో భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామశివారు దేవతైన అమ్మవారిని శ్రీవారి దర్శనానికి విచ్చేసిన భక్తుల్లో అధికశాతం మంది మార్గమధ్యలో ఈ ఆలయంలో దర్శిం చుకుని తరిస్తుంటారు. ఈక్రమంలో శుక్రవారం విశేషపుష్పాలతో అలంకృతులైన అమ్మవారిని భక్తులు దర్శించుకుని కుంకుమ పూజలు జరిపించుకున్నారు. అనంతరం అర్చకులు అమ్మకు పంచహారతులు ఇచ్చారు.


అవగాహన కార్యక్రమంలో విద్యార్థులతో పోలీసు అధికారులు, కళాశాల సిబ్బంది

మహిళల భద్రత కోసం పోష్ చట్టం

పెదపాడు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):మహిళల భద్రత, సమాజంలో గౌరవం, హక్కుల పరిరక్షణకు, ఉద్యోగ ప్రదేశంలో సురక్షిత వాతావరణం, లైంగిక వేధింపుల నుంచి రక్షణ కోసం పోష్ చట్టం పనిచేస్తుందని మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ యు.రవిచంద్ర తెలిపారు. వట్లూరు సర్‌సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల అంతర్గత ఫిర్యాదు సంఘం, మహిళా సెల్ విభాగం, ఎన్.ఎస్.ఎస్.ల సంయుక్త ఆధ్వర్యంలో ఉద్యోగ స్థలంలో సామరస్యం - పోష్ చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. డీఎస్పీ రవిచంద్ర మాట్లాడుతూ ఈ చట్టం ప్రకారం ఎలాంటి వేధింపులు జరిగినా మహిళ వెంటనే ఫిర్యాదు చేయవచ్చునని పేర్కొన్నారు. సీఐ ఎం.సుబ్బారావు, ఎస్సై బి.నాగమణి, కళాశాల కరస్పాండెంట్ జాస్తి మల్లికార్జునుడు, హరిరామకృష్ణం రాజు, ప్రిన్సిపాల్ డాక్టరు కె.వెంకటేశ్వరరావు, కన్వీనర్ డాక్టరు ఐ.హేమలత పాల్గొన్నారు.


రోబోటిక్స్‌పై అవగాహన తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

భవిష్యత్ అంతా రోబోటిక్స్‌దే

లింగపాలెం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):లింగపాలెం మండలం ధర్మాజీగూడెం క్రిశాలిస్ పాఠశాలలో రెండో రోజు రోబోటిక్స్‌పై అవగాహన కార్యక్రమం, ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు క్రాంతి కుమార్, విజయ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలను ప్రోత్సహించడంతోపాటు సాంకేతిక రంగంలో ఎదగాలన్న లక్ష్యంతోనే ఈ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా సమాజంలో అట్టడుగు వర్గాల నుంచి వస్తున్న విద్యార్థులు సైతం నూతన ఆవిష్కర్తలుగా, సాంకేతిక నిపుణులుగా ఎదిగేందుకు తోడ్పడతాయన్నారు. మండలంలోని పలు పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు.


తుపాకులతో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న సాయుధ బలగాలు

ఉగ్రవాదులు దాడి చేస్తే ఏం చేయాలి ?

నిట్‌లో ఆక్టోపస్ మాక్‌డ్రిల్

తాడేపల్లిగూడెం అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):తాడేపల్లిగూడెం ఏపీ నిట్‌లో శుక్రవారం ఆక్టోపస్ కమెండోస్ డీఎస్పీ రాంబాబు ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఉగ్రవాదులు దాడి చేస్తే వారిని సమర్థవంతంగా ఎలా ఎదుర్కోవాలి, ఆత్మరక్షణ ఎలా పొందాలి, ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా బాధి తులను ఎలా రక్షించాలి అనే దానిపై అవగాహన కలిగించారు. విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు రక్షణ వ్యవస్థను అప్రమత్తం చేసే విధానంతోపా టు ఉగ్రవాదులు చొరబడిన భవనం, పరిసరాలు లోపలకు, బయటకు వెళ్లే మార్గాలు, భవనంలో ఎంతమంది చిక్కుకుపోయారు. బాంబులను అమర్చారా, సీసీ కెమరాల ద్వారా అనుమానితులను గుర్తించే వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆక్టోపస్ కమాండోస్ డీఎస్పీ రాంబాబు మాట్లాడుతూ విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు పోలీసులు, రెవెన్యూ, ఇంటెలిజెన్స్, హెల్త్ తదితర శాఖలను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. డీఎస్పీ విశ్వనాద్, ఇన్‌స్పెక్టర్లు శివాజీ, నీలకంఠ, సీఐ ఆదిప్రసాద్ పాల్గొన్నారు.

పోలీసుకు ప్రతిష్ట హోంగార్డ్స్

నేడు 63వ ఆవిర్భావ దినోత్సవం.. ఉమ్మడి జిల్లాలో 580 మంది సేవలు

ఏలూరు క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సమాజంలో శాంతి భద్రతలు కాపాడడంలో పోలీస్‌శాఖ అహర్నిశలు కష్టపడుతున్నది. కానీ వారితో పాటే సమాంతరంగా రేయనకా పగలనకా వాననకా ఎండనకా విధినిర్వహణలో ఖాకీ యూనిఫాం ధరించి సమర్థవంతంగా విధులను నిర్వర్తిస్తూ పోలీస్‌శాఖకు వెన్నెముఖలా పనిచేస్తున్న హోంగార్డుల సేవలకు ప్రశంసలు అందించక తప్పదు. సేవా ధృక్పదంతో గృహ రక్షణదళంగా 1946 డిసెంబరు 6న ముంబైలో హోంగార్డు సంస్థను ఏర్పాటు చేశారు. అప్పట్లో జరిగిన అల్లర్లను అణిచివేయడానికి పోలీసుకు సహాయకారులుగా హోంగార్డులు తమ సేవలను అందించారు. 1962లో చైనాతో యుద్ధం జరుగుతున్న సమయంలో దేశంలోని ప్రజలకు వారి గృహాలకు రక్షణ కోసం హోంగార్డు కీలకపాత్ర పోషించింది. దీనిలో భాగంగానే 1963లో డిసెంబరు 6న రాష్ట్రంలో హోంగార్డు యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 1925 ఏప్రిల్ 24న ఏర్పాటు చేశారు. ప్రస్తుతం హోంగార్డు యూనిట్ ఉమ్మడి జిల్లాలోనే ఒక యూనిట్‌గా కొనసాగుతూనే ఉంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో మొత్తం 605 హోంగార్డు పోస్టులు ఉండగా ప్రస్తుతం 580 మంది ఉన్నారు. ఏలూరు జిల్లాలో ప్రస్తుతం 380 మంది హోంగార్డు ఉండగా, పశ్చిమ గోదావరిలో భీమవరం యూనిట్‌గా 200 మంది విధులను నిర్వర్తిస్తున్నారు. జిల్లాలో హోంగార్డు విభాగంలో పనిచేస్తున్న హోంగార్డులు పోలీసులతో పాటు సమాంతరంగా విధులను నిర్వర్తిస్తున్నారు. రాత్రి వేళ గస్తీ, ట్రాఫిక్ విధులు, స్టేషన్‌లో సహాయ కారులుగా విధులను నిర్వర్తిస్తున్నారు. అంతేకాకుండా ఓఎన్‌జీసీ, విజిలెన్సు, శెట్టిపేట, విశాఖ స్టీల్‌ప్లాంట్, అగ్నిమాపక శాఖ, భీమవరంలోని మావుళ్ళమ్మ దేవాలయం, ద్వారకాతిరుమలలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద డిప్యూటేషన్‌లో హోంగార్డులు విధులను నిర్వర్తిస్తున్నారు. హోంగార్డులు ఖాకీ యూనిఫాం ధరించి పోలీస్‌శాఖ ప్రతిష్ఠ పెంచడానికి వారు కష్టించి విధులను నిర్వర్తిస్తూనే ఉన్నారు. నేటికి కూడా వారు రోజువారీ వేతనదారులుగా మిగిలిపోతున్నారు. ఏ రోజు విధుల్లోకి వస్తే ఆ రోజు రోజుకు 710 రూపాయలు చొప్పున గౌరవ వేతనాన్ని ఇస్తారు. నెలలో వేతనంతో కూడిన రెండు సెలవులను మంజూరు చేస్తారు. వారు ఎలాంటి సెలవులు పెట్టుకోవడానికి అవకాశమే లేదు. డ్యూటీ చేస్తేనే వారికి గౌరవవేతనం జీతంగా అందుతుంది. హోంగార్డులు మరణిస్తే ఎక్స్‌గ్రేషియోగా ఐదు లక్షల రూపాయలను ఇన్సూరెన్సుల ద్వారా అందిస్తున్నారు. హోంగార్డులు అందరూ ఒకరి కొకరు ఆర్థికంగా సహాయం చేసుకునే నిమిత్తం నెలకు ఒక్క రోజు వేతనాన్ని స్వచ్ఛందంగా వెల్ఫేర్ ఫండ్‌కు ఇస్తున్నారు. దీంతో ఎవరైనా మరణించినా, పదవి విరమణ చేసినా ఆ ఒక్కరోజు వేతనాన్ని వారికి గౌరవంగా అందిస్తున్నారు. మట్టి ఖర్చులు నిమిత్తం హోంగార్డు చీఫ్ ఆఫీస్ పది వేల రూపాయలను సహాయం అందిస్తుంది. జిల్లాలో పనిచేస్తున్న హోంగార్డు నేరస్తులను అరెస్టు చేయడంలోనూ, ట్రాఫిక్ విధుల్లోనూ వివిధ బందోబస్తుల్లోనూ సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తూ పోలీసు శాఖకు చేదోడువాదోడుగా నిలుస్తున్నారు. వారి సేవలను గుర్తు చేసి వారి మరింత ఉత్సాహన్ని నెలకొల్పడానికి స్వచ్ఛంద సేవా సంస్థగా ఏర్పడిన హోంగార్డు సంస్థ ఆవిర్భావ దినోత్సవం అయిన నేడు ఏలూరు జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఉదయం 8 గంటలకు ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై హోంగార్డును ఉద్దేశించి ప్రసంగిస్తారు.


హోంగార్డులకు నిర్వహిస్తున్న క్రీడా పోటీలు

హోం గార్డ్సు డేకు రిహార్సల్స్ ఓకే

ఏలూరు క్రైం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):ఏలూరులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం ఉదయం 63వ హోంగార్డు జరగనున్న దృష్ట్యా ముందస్తుగా హోంగార్డులతో రిహార్సల్స్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఏలూరు జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీ జి.మునిరాజా స్వయంగా పర్యవేక్షించారు. హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని హోంగార్డులకు ఆటలపోటీలను కూడా నిర్వహించారు. విజేతలకు శనివారం ఉదయం హోంగార్డు డేకు ముఖ్య అతిథిగా హాజరవుతున్న జీవీజీ అశోక్‌కుమార్ చేతుల మీదుగా బహుతులను, ప్రశంసాపత్రాలను అందిస్తారు.

బీఎస్ఎన్ఎల్ టవర్లు ఏర్పాటు చేయండి


మంత్రి పెమ్మసానికి వినతిపత్రం సమర్పిస్తున్న ఎంపీ మహేశ్

ఏలూరు టూటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):ఏలూరు జిల్లాలో పెండింగులో ఉన్న ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ టవర్లు ఏర్పాటు చేయాలని కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్‌కు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్‌లో కేంద్ర మంత్రిని కలిసి మొబైల్ టవర్ల ఏర్పాటుపై చర్చించి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఎంపీ మహేశ్ మాట్లాడుతూ ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మొబైల్ నెట్‌వర్క్ కవరేజ్ సరిగా లేదనే విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ టవర్ల ఏర్పాటు ప్రతిపాదనలు కేంద్రం వద్ద పెండింగులో ఉన్న విషయం మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పంది ంచిన మంత్రి తిమ్మసాని వీలైనంత త్వరలో మొబై ల్ టవర్ల ఏర్పాటుకు తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని తెలిపారు. ఇప్పటి వరకు పీఎంయూవై పథకంలో జిల్లాకు 23719 ఎల్‌పీజీ గ్యాస్ కనెక్షన్లు ఇచ్చినట్టు ఎంపీ మహేశ్ తెలిపారు. పార్లమెంట్‌లో ఎల్‌పీజీ కనెక్షన్ల పై మహేశ్ అడిగిన ప్రశ్నపై కేంద్ర మంత్రి సురేశ్‌గోపి సమాధానం ఇచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ట్రామకేర్ ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారని పార్లమెంట్‌లో ఎంపీ మహేశ్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా కేంద్ర మంత్రిత్వ శాఖ ఇచ్చిన సమాచారం మేరకు రాష్ట్రంలో 92కోట్లతో 14ట్రామా కేర్‌సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఏలూరు జిల్లా ఆసుపత్రిలో ట్రామాకేర్ సెంటర్‌లో అత్యాధునిక సదుపాయలు కల్పిస్తున్నట్లు ఎంపీ మహేశ్ తెలిపారు.

యూత్ పార్లమెంట్‌లో రన్నరప్‌గా రమా పార్వతి


విద్యార్థినిని అభినందిస్తున్న యాజమాన్యం

తాడేపల్లిగూడెం టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో నిర్వహించిన యూత్ పార్లమెంట్‌లో రన్నరప్‌గా ఆదిత్యా కళాశాల విద్యార్థిని నిలిచిందని ప్రిన్సిపాల్ లక్ష్మి సరోజ తెలిపారు. యూత్ పార్లమెంట్‌లో నాలుగు రౌండ్‌లు నిర్వహించగా రాజకీయ సామాజిక అంశాలపై చర్చించారని వివరించారు. దీనిలో ద్వారం పూడి రమాపార్వతి రన్నరప్‌గా నిలిచారన్నారు.

ఏపీ నిట్ విద్యార్థుల్లో జోష్

తాడేపల్లిగూడెం ఏపీ నిట్ ప్రాంగణం


ఉద్యోగాల కల్పనలో ముందంజ

తాడేపల్లిగూడెం అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం ఏపీ నిట్‌లో గత ఏడాది చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఉద్యోగాలు ఆశాజనకంగా ఉన్నాయి. ఉద్యోగాల కోసం ఏపీ నిట్ నుంచి 619 మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకున్నారు. అందులో 85 శాతం మందికి క్యాంపస్ సెలక్షన్స్ ద్వారా ఉద్యోగాలు లభించాయి. మరో 5 శాతం మంది విద్యార్థులు కంపెనీలు వ్యక్తి గతంగా నిర్వహించే ఇంటర్వ్యూలలో పాల్గొని ఉద్యోగాలకు ఎంపికయ్యారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులలో సుమారు 560 మందికి ఉద్యోగాలు లభించాయి. డిసెంబరు మాసాంతరం వరకు క్యాంపస్ సెలక్షన్స్ కోసం కంపెనీలు రాబట్టేందుకు నిట్ అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఐదేళ్ళగా ఖాళీగా వున్న నిట్ డైరెక్టర్ పోస్టుకు ఇటీవల ఇంటర్వ్యూలు పూర్తి అయ్యాయి. త్వరలోనే నియామకం జరగనుందని నిట్ వర్గాలు ఆశిస్తున్నాయి. ఇది పూర్తి అయితే అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని భర్తీ చేస్తారు. కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న రూ.400 కోట్లు నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది.


ఎంపికైన క్రీడా జట్టుతో కరస్పాండెంట్ తదితరులు

ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

పెదవేగి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో యూనివర్శిటీ ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు శుక్రవారం జరిగాయి. పెదవేగి మండలం దుగ్గిరాలలోని సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాలలో శుక్రవారం జరిగిన ఈ ఎంపిక పోటీల్లో మెడికల్, దంత, హోమియోపతి, నర్సింగ్, పారా మెడికల్ విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్ పోటీలను ప్రారంభించారు. రాష్ట్రంలోని వివిధ కళాశాలలకు చెందిన 65మంది ఈ పోటీల్లో పాల్గొనగా, ప్రతిభ కలిగిన క్రీడాకారులతో ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ ఫుట్‌బాల్ జట్టును ఎంపిక చేశారు. ఎంపిక చేసిన జట్టు ఈ నెల 24వ తేదీ నుంచి 30 వరకు కేరళ రాష్ట్రంలోని కాలికట్ యూనివర్శిటీలో జరిగే పోటీల్లో పాల్గొంటారని కళాశాల పీడీ ఎన్.నల్లయ్య తెలిపారు.

గొరగనమూడి విద్యార్థులకు అభినందన


క్రీడాకారులను అభినందిస్తున్న సర్పంచ్ గొట్టుముక్కల శివాజీరాజు, హెచ్‌ఎం

పాలకోడేరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14 నెట్‌బాల్ పోటీల్లో రాణించిన గొరగనమూడి స్వామి జ్ఞానానంద జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులను సర్పంచ్ గొట్టుముక్కల శివాజీ రాజు, ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి శుక్రవారం అభినందించారు. శృంగవృక్షంలో ఇటీవల జరిగిన నెట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించడమే కాకుండా హైస్కూల్ నుంచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన వారిని సత్కరించారు.

ట్రాఫిక్‌పై అవగాహన కోసం నేడు 3కె రన్

భీమవరం టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రాఫిక్ పై ప్రజలలో అవగాహన కల్పించేందుకు శనివారం బీవీ రాజు సర్కిల్ నుంచి 3కె రన్ ఉదయం 6-30 గంటలకు ప్రారంభం అవుతుందని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. అక్కడి నుంచి జువ్వలపాలెంరోడ్‌లోని ఏ.ఎస్.ఆర్ విగ్రహం వరకు కొనసాగుతుందన్నారు. త్రీకె రన్‌లో విద్యార్థిని, విద్యార్థులు, వాకర్స్ అసోసియేషన్స్, అథ్లెట్స్ జిల్లా అధికారులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

చురుగ్గా మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణం



తాడేపల్లిగూడెం రూరల్, డిసెంబరు 5.(ఆంధ్రజ్యోతి):తాడేపల్లిగూడెం మండలం లింగారాయుడుగూడెంలో ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా నిర్మించతలపెట్టిన మ్యాజిక్ డ్రెయిన్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. 300 మీటర్ల పొడవున రెండు మీటర్ల వెడల్పుతో రూ.2.80 లక్షల వ్యయంతో ఈ మ్యాజిక్ డ్రెయిన్ పనులు చేపడుతున్నారు. భూగర్భ డ్రయినేజీ ఏర్పాటు చేసినా అవుట్‌లెట్ లేకపోవడంతో రోడ్లపైకి మురుగునీరు చేరుతుండటంతో గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు రెడ్డి రాము ఆధ్వర్యంలో ఈ పనులు చేస్తున్నారు. డ్రెయిన్ నిర్మాణ పనులను ఏపీవో సుధీర్ పర్యవేక్షించారు

మామిడికి స్వస్తి

పామాయిల్, మొక్కజొన్నపై మొగ్గు

చాట్రాయి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మామిడి పంటకు ప్రసిద్ధి చెందిన చాట్రాయి మండలంలో వరుస నష్టాలు తట్టుకోలేక రైతులు మామిడి తోటలు నరికేస్తున్నారు. 15 ఏళ్ళ క్రితం వరకు ఇక్కడి నుంచి విజయవాడ తరువాత భారీ స్థాయిలో ఢిల్లీ, ముంబాయి, అహ్మదాబాద్, ఇండోర్, చెన్నై తదితర నగరాలకు మామిడి ఎగుమతులు జరిగేవి. గతంలో మండలంలో సుమారు 20 వేల ఎకరాలలో మామిడి తోటలు విస్తరించి ఉండేవి. ఇప్పుడు 5 వేల ఎకరాలకు తగ్గిపోయాయి. మామిడికి ఆదాయం తగ్గిపోవటం, పామాయిల్, మొక్కజొన్న సాగులో మంచి లాభాలు వస్తుండటంతో మామిడి తోటలు నరికి పామాయిల్, మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ఒకప్పుడు ఈ ప్రాంత రైతులకు మామిడి పంట కాసుల వర్షం కురిపించింది. తరువాత రైతులు అధిక దిగుబడులు ఆశించి పురుగు మందులు, రసాయనిక ఎరువులు విచక్షణరహితంగా వినియోగించటం వలన మంగు తెగులు వచ్చి నాణ్యత దెబ్బ తింది. దీనికి తోడు ఢిల్లీ సేట్‌ల మార్కెట్ మాయాజాలం వలన ధరలు పతనం కావటం, కోతకూలీ రవాణా ఖర్చులు బాగా పెరగటం వలన రైతులు నష్ట పోయారు. దీనితో మామిడి తోటలు నరకక తప్పని పరిస్థితి.



నరికేస్తూ.. రోడ్డు పక్కన పడేసిన మామిడి చెట్లు

జీవం ఉట్టిపడేలా చిత్రలేఖనం

కాంతారావు చిత్ర లేఖనానికి ప్రశంసలు

ఏలూరు రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జీవం ఉట్టిపడేలా పెయింటింగ్ వేస్తూ కుంచె కదిపితే అద్భుత చిత్రాలకు రూపమిస్తూ ఏలూరుకు చెందిన మజ్జి కాంతారావు ఔరా అనిపిస్తున్నారు. సామాజికంగా ప్రస్ఫుటమయ్యే అంశాలపై ఆయన చిత్రాలు భావాలను పలికిస్తాయి. చిత్రాలను కళ్లకు కట్టినట్టు చూపడంలో ఆయన నైపుణ్యానికి నిదర్శనం. శుక్రవారం హైదరాబాదులోని జేఎస్టీయూ నెహ్రూ ఆర్ట్ గ్యాలరీలో ఒంగోలు ఆర్ట్ ఫెస్ట్ నిర్వహి ంచారు. భారతదేశ సాంప్రదాయ ఇళ్ల అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. వంద మంది కళాకారులు పాల్గొని వందల చిత్రాలు గీశారు. వీరితో ఏలూరు నగరానికి చెందిన చిత్ర కళాకారులు, మజ్జి సూర్యకాంతారావు, చిత్రీకరించిన సాంప్రదాయకర ఇంటిలో అమ్మ పిండి వంటలు చేస్తున్నట్టు రూపొందించిన చిత్రకళ అందర్నీ ఎంతగానో ఆకట్టుకున్నది. ప్రశంసలు అందుకుంది. ఈసందర్భంగా నిర్వా హకులు కాంతారావుకు ప్రశంసా పత్రం, మెమెంటోతో ఘనంగా సత్కరించారు. పలు కళాశాల సంస్థల ప్రతినిదులు, చిత్రకళాకా రులు కాంతారావును అభినందించారు.



సత్కారం అందుకుంటున్న కాంతారావు.. వేసిన చిత్రం



విజ్జేశ్వరం నుంచి వేసే పైపులైన్ మ్యాప్‌ను మంత్రి దుర్గేశ్‌కు వివరిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్

వాటర్ గ్రిడ్ పథకానికి పవన్ శంకుస్థాపన !

- ఈ నెల మూడో వారంలో విజ్జేశ్వరం, పెరవలి రాక
- రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్

పెరవలి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజలకు స్వచ్ఛ జలాలను అందించే జలజీవన్ మిషన్ వాటర్ గ్రిడ్ పథకానికి ఈ నెల మూడో వారంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేయనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకం కింద రూ.1400 కోట్లు మంజూరు చేశాయి. విజ్జేశ్వరం బ్యారేజ్ నుంచి గోదావరి నీటిని శుద్ధి చేసి పైపులైన్‌ల ద్వారా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని అన్ని ప్రాంతాలకు సరఫరా చేస్తారు. పెరవలిలో భారీ భూగర్భ మంచినీటి ట్యాంక్‌ను నిర్మించనున్నారు. ఈ ప్రాంతాన్ని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి పశ్చిమలోని 854 గ్రామాలకు ఈ పథకం ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు. విజ్జేశ్వరం, పెరవలిలలో పనులకు పవన్ శంకుస్థాపన చేస్తారని, అనంతరం ఇక్కడ నిర్వహించే భారీ బహిరంగ సభలో మాట్లాడతారని తెలిపారు. పెరవలి, కానూరు, నిడదవోలు, వేలివెన్నులలో భూగర్భ మంచినీటి ట్యాంక్‌లు నిర్మించనున్నట్లు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్‌డీఈ శ్రీనివాస్ మాట్లాడుతూ ఐదు లక్షల లీటర్లు పట్టే విధంగా 30 సెంట్ల స్థలంలో ట్యాంకు నిర్మిస్తామన్నారు. ఏఈ బాలమురళీకృష్ణ, పిప్పర రవి, అతికాల శ్రీను, సలాది కృష్ణమూర్తి, బొడ్డు రామాంజనేయులు, తహసీల్దార్ నిరంజన్, ఎంపీడీవో ఉమా రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఎత్తుకు పైఎత్తు..

చెస్‌లో ఒకేసారి 30 మందిని ఓడించిన కృష్ణతేజ



చెస్ ఆడుతున్న కృష్ణతేజ

ఏలూరు రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా చదరంగం ఒకరితో ఆడి గెలవడమే కష్టం. ఈ ఆటలో ప్రత్యర్థిగా ఉన్న వ్యక్తి ఎప్పుడు ఎలాంటి మూవ్‌లో చెక్ పెట్టేస్తాడన్నది ఊహించడం కష్టమే. అలాంటిది ఏకంగా ఒకే సమయంలో 30 మందితో చెస్ ఆటడం అంటే మామూలు విషయమా.. 30 మందితో ఆడి 30 గేమ్స్‌లో కూడా విజయం సాధించడం అంటే అబ్బురమే. తాడేపల్లిగూడెం చెందిన ఇంటర్నేషనల్ మాస్టర్ ఎన్. కృష్ణతేజ, వట్లూరు సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాలలో అనసూయ అకాడమీ సహకారంతో విద్యార్థులకు చదరంగంలో శిక్షణతో పాటు పోటీల్లో ఆయన పాల్గొన్నారు. పోటీలను స్కూల్ ప్రిన్సిపాల్ మహంతి ప్రారంభించారు. ఒకరితో ఆడి గెలిస్తే కిక్ ఏముంటుంది అనుకున్నాడో ఏమో ఒకేసారి 30 మందితో, ఇందులో 15 మంది అంతర్జాతీయ క్రీడాకారులు కూడా ఉండటం విశేషం. అందరితో చేసి ఆడి విజయం సాధించి ఔరా అనిపించాడు.

పంచాయతీ వ్యవస్థ బలోపేతం

- ఉమ్మడి పశ్చిమలో ఏడు డీడీవో కార్యాలయాలు ప్రారంభం
- కార్యాలయంలో డీఎల్‌పీవో, డ్వామా ఏపీడీ ఇతర ఆఫీసులు

(ఏలూరు సిటీ-ఆంధ్రజ్యోతి)



ఏలూరులోని డీడీవో కార్యాలయం

ఉమ్మడి జిల్లాలో పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం కానుంది. డివిజన్ స్థాయిలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించే శాఖలన్నింటినీ ఒకే పరిపాలన నియంత్రణలోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. డివిజినల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీడీవో) కార్యాలయాలతో సమన్వయం చేసుకుని అభివృద్ధి కార్యక్రమాలను సమర్థంగా అమలు చేసేందుకు ప్రణాళికలను రూపొందించింది. గతంలో ఉన్న బ్లాక్ డెవలప్‌మెంట్ అధికారుల తరహాలో ఇప్పుడు డివిజన్ స్థాయిలో డీడీవో వ్యవస్థను తీసుకువచ్చింది. ఎంపీడీవోలకు పదోన్నతులు కల్పించటంతో నియమితులైన డీడీవో డివిజన్ స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించనున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్‌లో సంస్కరణలు తీసుకురావటంతో డీడీవోలకు విశేష అధికారాలు సంక్రమించాయి. డివిజినల్‌స్థాయిలో ఉన్న డివిజినల్ పంచాయతీ కార్యాలయం (డీఎల్‌పీఓ), డ్వామా అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ (డ్వామా ఏపీడీ) ఇతర శాఖలకు సం బంధించిన డివిజినల్ కార్యాలయాలను డీడీవో కార్యాలయాల సముదాయంలోకి మార్చాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి నాంది పలికింది. డీడీవో కార్యాలయాల ఏర్పాటుతో పంచాయతీ పాలన వేగవంతం అవుతుంది. ఇంత వరకు పోలీస్, రెవెన్యూ శాఖలకు డివిజినల్‌స్థాయిలో కార్యాలయాలు ఉన్నాయి. ఇకపై పంచాయతీరాజ్ వ్యవస్థలో డివిజినల్ కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. పూర్తిస్థాయిలో ఈ పాలన విస్తరిస్తే గ్రామాలు మరింత అభివృద్ధి చెందటంతోపాటు పాలనా వికేంద్రీకరణ జరిగే అవకాశాలున్నాయి.

ఉమ్మడి జిల్లాలో 7 కార్యాలయాలు

ఉమ్మడి జిల్లాలో ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం, కొవ్వూరులలో ఏడు డీడీవో కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. వీటి ఏర్పాటుకు జడ్పీ నిధులు కేటాయించారు. గురువారం నుంచి తమ కార్యకలాపాలు ప్రారంభించాయి.

పాలనలో నూతన సంస్కరణలు..

పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక(జీపీడీపీ) లను డీడీవోలు రూపొందించి అమలు చేస్తాయి. ఆర్థిక వనరులను సమకూర్చుకునేందుకు పంచాయతీలో పన్నులు, ఫీజుల వసూళ్లపై దృష్టి సారిస్తారు. 16 రకాల అధికారాలను గ్రామ పంచాయతీలపై డీడీవోలు కలిగి ఉంటారు. పంచాయతీల్లో ఉపాధి పనుల పర్యవేక్షణ, సోషల్ ఆడిట్ సిబ్బందితో గ్రామాల్లో తనిఖీలు నిర్వహించటంతోపాటు స్వయం సహాయక సంఘాల ద్వారా స్వయం ఉపాధి కోసం సహకారం అందిస్తారు.

డీడీవోలకు విధులు..

డీడీవో డివిజన్ స్థాయిలో అన్ని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి విభాగాలపై నియంత్రణ బాధ్యతలు నిర్వహిస్తారు. జిల్లా కలెక్టర్ నియంత్రణలో ఉంటూ డివిజన్ స్థాయిలో ఆయా శాఖల అనుసంధానంతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇప్పటి వరకు స్థానిక సంస్థల ఎన్నికలకు డిప్యూటీ డిస్ట్రిక్ట్ ఎన్నికల అథారిటీగా ఆర్డీఓలు ఉండేవారు. ఇక నుంచి డీడీవోలకు ఆ బాధ్యతలు అప్పగిస్తూ పంచాయతీరాజ్ రూల్స్‌ను సవరిస్తారు.

పాలన సులభతరం

-కె భీమేశ్వర్, జడ్పీ ఇన్‌చార్జి సీఈఓ



డీడీవో కార్యాలయాలు ఏర్పాటుతో పంచాయతీల పాలన సులభమవుతుంది. డివిజన్ స్థాయి మానిట రింగ్ వ్యవస్థ ఏర్పడింది. పంచాయతీల పాలనతో పాటు, మండల పరిషత్‌లో జరిగే కార్యకలాపాలపై డీడీవోల పర్యవేక్షణ ఉంటుంది. పంచాయతీరాజ్ వ్యవస్థకు డివిజనల్ స్థాయిలో కార్యాలయాలు ఏర్పాటు కావటంతో పంచాయతీ పాలన వేగవంతమవుతుంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 7 డీడీవో కార్యాలయాలను జడ్పీ నిధులతో నిర్మించటం జరిగింది. ఈ కార్యాలయాలలో పాలన వేగవంతమైతే పంచాయతీలలో సుస్థిర అభివృద్ధికి సాధ్యమవుతుంది.



విద్యార్థులకు బహుమతులు అందించిన దృశ్యం



ఉండి కేవీకేలో మాట్లాడుతున్న డాక్టర్ డిబోరా మెషియానా

నేలలను పరిరక్షించుకోవాలి

పెనుమంట్ర, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మార్టేరులోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వ్యవసాయ పాలిటెక్నిక్‌లో ప్రపంచ మృత్తిక దినోత్సవాన్ని నిర్వహించారు. మార్టేరు వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఇన్‌చార్జి ఎ.డి.ఆర్. డాక్టర్ బి. సహదేవ రెడ్డి అధ్యక్షత వహించి నేలలను పరిరక్షించుకోవలసిన ఆవశ్యకతను వివరించారు. విచక్షణా రహితంగా ఎరువులు, ఇతర రసాయనాల వినియోగం వల్ల నేల, నీరు కలుషితమవుతుందని, వీటిని తగ్గించే దిశగా రైతులను సమాయత్తం చేయవలసిన ఆవశ్యకత శాస్త్రవేత్తలపై ఉన్నదన్నారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు, డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు, పాల్గొన్నారు. అనంతరం నెగ్గిపూడిలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

ఉండి: నేలలు ఆరోగ్యంగా ఉంటేనే పంటలు బాగా పండుతాయని ఉండి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ మల్లికార్జునరావు అన్నారు. శుక్రవారం ఉండి కేవీకేలో ఆయన మాట్లాడారు. నేలల సంరక్షణ, పచ్చదనం, ఆరోగ్యకరమైన జీవనానికి అంద రూ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నగరాల్లో పారిశ్రామికీకరణ, వాహనాలు, ఇళ్లలో వాడే శీతలీకరణ పరికరాలు కారణంగా వాయు, నీటి కాలుష్యంతో పాటు నేల కూడా కాలుష్యం అవుతుందన్నారు. నగరాల్లో మొక్కలను ఎక్కువగా పెంచి కాలుష్యాన్ని తగ్గించి నేలను సంరక్షించాలని కోరారు. చిట్టవరం, నవరసపురంల నుంచి రైతులు విచ్చేశారు. ఉండి కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ డిబోరా మెషియానా, డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, డాక్టర్ బిందు ప్రవీణ, డాక్టర్ వినయలక్ష్మి పాల్గొన్నారు.



రైట్ రైట్ బస్సును ప్రారంభించి నడుపుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్

విద్యార్థుల బస్సు కష్టాలకు చెక్

పెదవేగి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):విద్యార్థుల కల నెరవేరింది. ఇకపై ఎటువంటి ఇబ్బందులు లేకుండా విద్యాలయాలకు చేరుకునే వెసులుబాటు కలిగింది. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ చొరవతో విద్యార్థులను కలెక్టర్ దగ్గరకు తీసుకెళ్లి వారి సమస్యకు పరిష్కారం చూపారు. రామశింగవరం, కూచింపూడి, పెదవేగి, లక్ష్మీపురం గ్రామాల విద్యార్థులు ఉదయం కళాశాలలకు వెళ్లే సమయంలో బస్సు ఖాళీ లేక ఇబ్బందులు పడుతుండడంతో గురువారం వారు కూచింపూడిలో బస్సును ఆపి నిరసన తెలిపారు. ఎమ్మెల్యే విద్యార్థులతో కలిసి కలెక్టర్ కె.వెట్రి సెల్వీని కలిసి సమస్య వివరించారు. ఆమె శుక్రవారం నుంచి బస్సు నడిచేలా చర్యలు తీసుకున్నారు. ఎమ్మెల్యే ప్రభాకర్ శుక్రవారం ఉదయం రామ శింగవరంలో బస్సును ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను బస్సులో ఎక్కించుకుని పెదవేగి వరకు ఆయనే స్వయంగా బస్సును నడిపారు. ఎమ్మెల్యేకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

చర్లపల్లి నుంచి నర్సాపురానికి ప్రత్యేక రైలు

ఏలూరు క్రైం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా ఒక ప్రత్యేక రైలు(ఒకవైపు)ను నడపడానికి దక్షిణ మధ్య రైల్వే శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. రైల్ నంబర్ 07140 చర్లపల్లి నుంచి నరసాపూర్‌కు ఈ నెల 26న ఈ ప్రత్యేక రైలును నడపనున్నారు. చర్లపల్లిలో రాత్రి 10.40 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.45 గంటలకు నర్సాపురం రైల్వే స్టేషన్‌కు చేరుకుంటుంది. ఈ రైలు నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం, పాలకొల్లు స్టేషన్లలో ఆగుతుంది. ఫస్ట్ క్లాస్ ఏసీ, సెకండ్ క్లాస్ ఏసీ, త్రీ టైర్ ఏసీ, స్లీపర్ అండ్ జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయి.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ద్వారకాతిరుమల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):తిమ్మాపురం, తిరుమలంపాలెం, పావులూరివారిగూడెంలలో ఎరువుల దుకాణాలను ఏడీఏ పీజీ బుజ్జిబాబు శుక్రవారం తనిఖీలు చేశారు. దుకాణాలల్లో ఈ పాస్ నిల్వలు, ఎరువుల ఓ ఫారంలను పరిశీలించారు. పావులూరివారిగూడెం గోద్రెజ్ ఆగ్రో విత్ మాటూరి పంచాక్షరీ వారు సరఫరా చేసిన సల్ఫర్ ఎరువుకు సంబంధించి ఓ ఫారంను లైసెన్స్‌లో జత పరచని కారణంగా రూ.12 లక్షల విలువైన 19 టన్నుల స్టాక్ అమ్మకాలను నిలిపివేశారు.



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

నరసాపురం రూరల్ : పట్టణ, మండలంలోని పలు ఎరువుల దుకాణాలతో పాటు సొసైటీ గోదాములను శుక్రవారం వ్యవసాయశాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఆ శాఖ ఏడీఏ ప్రసాద్ జీవన్, ఏవో జ్యోషిలా రికార్డులు, స్టాక్ వివరాలు, నిల్వలు, నోటీస్ బోర్డులను పరిశీలించారు. మొత్తం 17 దుకాణాల్లో తనిఖీలు చేశారు. నిబంధనలకు అనుగుణంగా ఎరువులు, పురుగుల మందులు విక్రయించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మెప్మాలో అవకతవకలంటూ బాధితుల ఆగ్రహం

ఆకివీడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెప్మా గ్రూప్‌లో అవకతవకలు జరిగాయి. స్థానిక వాసవి గ్రూప్‌లో ఈ ఏడాది మార్చి నెలలో లీడర్లు, సభ్యులకు సంబంధించి రూ.5లక్షలు క్యాష్ క్రెడిట్ లోన్ పొదుపు కింద డబ్బులు పడ్డాయి. గ్రూప్‌లో ముగ్గురు లీడర్లు, ఏడుగురు సభ్యులు ఉన్నారు. బ్యాంకులో పడి తొమ్మిది నెలలు కావస్తుంది, ఇంత వరకు యానిమేటర్ గ్రూప్ లీడర్లు, సభ్యులకు విషయం తెలియపర్చలేదు. వడ్డీ నెలకు రూ.4,500 చెల్లించాల్సి ఉండడంతో అసలు, వడ్డీ కలిపి దాదాపుగా రూ.లక్ష నష్టం వాటిల్లుతుందని లీడర్లు,సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యానిమేటర్‌కు లీడర్లు, సభ్యులు ఫోన్ చేస్తుంటే అందుబాటలోకి రావడంలేదంటున్నారు. ఇవే కాకుండా అనేక అవకతవకలు జరిగాయని బాధితులు ఆగ్రహిస్తున్నారు. బ్యాంకు మేనేజర్‌ను బాధితులు ప్రశ్నించగా సోమవారం క్లారిటీ ఇస్తామని తెలిపారన్నారు. అవకతవకలపై మెప్మా సీవో జయకృష్ణను ప్రశ్నించగా తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని, సమాచారం తెలిసిందన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని తెలిపారు. మరికొన్ని గ్రూపుల్లో కూడా అవకతవకలు జరిగినట్టు తెలుస్తోంది.

విధులకు ఆటంకం కలిగించడంపై కేసు

పెదపాడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఒక ఉపాధ్యాయురాలు తన విధులకు ఆటంకం కలిగించారంటూ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. గత అక్టోబరు 30వ తేదీన ఎంపీపీ స్కూల్ పక్కన వున్న చర్చిలో ఇంజమూల మరియదాస్ తల్లి మరణించడంతో భోజనాలు ఏర్పాటు చేశారు. ఆ సమయంలో ఇంజమూల కిరణ్ పాఠశాలకు వచ్చి విద్యార్థులను భోజనాలకు పంపమని ఉపాధ్యాయురాలు స్వప్నను అడిగారు. పిల్లల తల్లిదండ్రుల అనుమతితో పంపిస్తానని, అలాగే ఆ సమయానికి పిల్లల మధ్యాహ్న భోజనం కూడా పూర్తయినట్లుగా తెలిపారు. దీంతో ఇంజమూల కిరణ్ ఉపాధ్యాయురాలి మాటలు వినకుండా గొడవ చేసి విధులకు ఆటంకం కలిగించినట్లుగా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పెదపాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ వ్యర్థాల వాహనం పట్టివేత

పెదపాడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాలను తరలిస్తుండగా పెదపాడు మండలం సత్యవోలు గ్రామ పరిసరాల్లో తనిఖీలు నిర్వహించి వడ్డిగూడెం రోడ్డులో ఒక ఐషర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లుగా పెదపాడు ఎస్సై కట్టా శారదా సతీష్ తెలిపారు. చికెన్ వేస్ట్‌ను, వాహనాన్ని స్వాధీనం చేసుకుని, వాహన యజమాని, డ్రైవర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్యకు దారితీసిన వివాహేతర సంబంధం



హత్య కేసులో నిందితులను అరెస్టు చేసి వివరాలు తెలుపుతున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్

భీమడోలు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఒక మహిళతో ఇరువురు వివాహేతర సంబంధం కారణంగా పూళ్లలో ఒక వ్యక్తి హత్యకు దారి తీసిందని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఈనెల 2వ తేదీన పూళ్ళ సంతమార్కెట్‌లో పట్టపగలు జరిగిన దారుణ హత్యకు సంబంధించి నలుగురు వ్యక్తుల్ని భీమడోలు పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ శ్రావణ్‌కుమార్ భీమడోలు సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో హత్యకు దారి తీసిన వివరాలను వెల్లడించారు. పూళ్ళ పడమట దళితపేటకు చెందిన మృతుడు పాతల నాగరాజు (48) కాండ్రు ఇస్సాకు వీరిరువురికీ ఒకే మహిళతో వివాహేతర సంబంధం ఉండేదని దీనిపై పాత గొడవలు కోర్టు కేసులు కూడా ఉన్నాయని తెలిపారు. దీనిపై ఏవన్ నిందితుడు కాండ్రు ఇస్సాకు ఎలాగైనా పాత నాగరాజు అడ్డు తొలగించు కోవాలని భావించి కుటుంబ సభ్యులైన కాండ్రు నాగతేజ, అద్దంకి బాబి, స్నేహితుడైన కాలి రాజేష్‌లతో పథకం ప్రకారం తమ వెంట తెచ్చుకున్న కత్తులతో పాత నాగరాజుపై దాడి చేసి హత్య చేశారు. అనంతరం పరారయ్యారు. కేసును దర్యాప్తు చేపట్టి భీమడోలు సీఐ యుజె విల్సన్, ఎస్‌ఐ మదీనా బాషా సిబ్బందితో పూళ్ళ శివారు పోలిమేర పుంత కురెళ్ళగూడెం శ్మశాన వాటిక సమీపంలో అరెస్టు చేసినట్లు తెలిపారు.

నిందితులను అరెస్టు చేస్తాం : డీఎస్పీ

ఏలూరు క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): యువతిపై అత్యాచారానికి పాల్పడిన రౌడీ షీటర్‌తో పాటు అతనికి సహకరించిన వారిని అరెస్టు చేసి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ చెప్పారు. డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ డి శ్రావణ్‌కుమార్, టూటౌన్ సీఐ అశోక్‌కుమార్ మాట్లాడారు. ఏలూరుకు చెందిన ఉలిగడ్డ జగదీష్‌బాబుపై సస్పెక్ట్ షీటు ఉందని అతనిపై 10 కేసులు ఉన్నాయని మంగళగిరిలో ఉంటూ ఒక ప్రైవేటు ట్రావెల్ బస్సును నడుపుతున్నాడని ఈనెల 2వ తేదీన ఒక చోరీ కేసులో తాడేపల్లిగూడెం కోర్టుకు హాజరై తిరిగి ఏలూరు వచ్చాడన్నారు. అతనికి ఏలూరుకు చెందిన ఓ మహిళతో పాటు, ఆమె కుమార్తెతో వివాహేతర సంబంధం ఉందన్నారు. ఆ మహిళ నేరస్తులకు సహకరిస్తూ చోరీ చేసిన సొత్తును దాచి వారికి సహకరిస్తుందన్నారు. జగదీష్‌బాబు ఆమె వద్దకు 2వ తేదీ రాత్రి లావేటి భవానీ కుమార్‌తో కలిసి వెళ్లాడన్నారు. ఆ సమయంలో ఇంట్లో ఆ మహిళ కుమార్తె, ఆమె స్నేహితురాలైన ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఓ యువతి ఉన్నారన్నారు. అర్ధరాత్రి కుమార్తె స్నేహితురాలైన యువతిని జగదీష్ కొట్టి సమీప ప్రాంతానికి తీసుకువెళ్లి అత్యాచారం చేశాడని తెలిపారు. ఈ కేసులో నిందితులను అరెస్టు చేయడానికి చర్యలు చేపట్టామన్నారు.

విద్యుదాఘాతంతో బాలుడికి గాయాలు



ఆకివీడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే క్వార్టర్స్ సమీపంలో శుక్రవారం పిల్లలు క్రికెట్ ఆడుతు న్నారు. క్రికెట్ ఆడుతుండగా బాల్ వెళ్ళి ట్రాన్స్‌ఫార్మర్ అవతల కౌంపౌండు వాల్ దగ్గర పడింది. బాల్ కోసం నమ్మి దేవహర్ష గోడ దూకి క్రికెట్ బాల్ తీసుకొని మరలా గోడ దూకి తీసుకొస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ పట్టుకోవడంతో షాక్ కొట్టింది. ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దేవహర్ష స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్నాడు.

మోటారు సైకిల్ చోరీ

పెదపాడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తన ఇంటి ముందు తాళం వేసి వున్న ఏపీ 40 ఎఫ్‌హెచ్ 1600 నెంబరు గల సుజికి యాక్సిస్ 125 వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్టు పెదపాడు మండలం కొత్తూరు గ్రామానికి చెందిన నల్లగొండ చంద్రమ్మ పెదపాడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. నవంబరు 27వ తేదీన ఘటన జరిగినట్లుగా, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



తణుకు ఉండ్రాజవరం జంక్షన్‌లో బోల్తా పడిన లారీ.. భీమవరం పెద్ద వంతెనపై అదుపు తప్పి డీవైడర్ ఎక్కిన కారు

అదుపు తప్పిన వాహనాలు

గోతుల్లో పడి లారీ బోల్తా..

తణుకు రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):నిత్యం జన సంచారంతో రద్దీగా వుండే తణుకు ఉండ్రాజవరం జంక్షన్‌లో శుక్రవారం బారీలోడుతో వెళ్తున్న ఐషర్ వ్యాన్ బోల్తా పడింది. ఈ సమయంలో ఈరోడ్డులో జన సంచారం తక్కువగా వుండటంతో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగపోవడంతో పాటు వాహనం నడిపే డ్రైవర్ కూడా తప్పించుకోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. తణుకు ఉండ్రాజవరం జాతీయ రహదారిపై వంతెన ఫ్లైవోవర్ నిర్మాణం పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో కొద్దిపాటి వర్షానికే ఇక్కడ రోడ్లు గోతులు పడి ప్రమాదకరంగా వుంటున్నాయి. ఈక్రమంలో శుక్రవారం తాడేపల్లిగూడెం నుంచి రావులపాలెం వెళ్తున్న పాత అట్టల లోడ్ ఐషర్ వ్యాన్ బోల్తా పడింది.

భీమవరంలో డీవైడర్ ఎక్కిన కారు

భీమవరం క్రైం: భీమవరం పట్టణంలోని పెద్ద వంతెనపై శుక్రవారం మధ్యాహ్నం ఒక కారు అదుపు తప్పింది. వేగంగా వెళ్తున్న కారు ముందు వెళ్తున్న ఆటోను తప్పించబోయి ఒక్కసారిగా ఎడమ పక్కకు వెళ్ళడంతో కారు డివైడర్ ఎక్కింది. దీంతో టైరు పేలిపోవడంతో అక్కడ ఉన్నవారంతా భయబ్రా ంతులకు గురయ్యారు. కారులో ఉన్నవారికి స్వల్ప గాయాలయ్యాయి. సుమారు గంటసేపు ట్రాఫిక్ ఆగిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మొత్తం మీద ట్రాఫిక్ పోలీసులు అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం

దెందులూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : దెందులూరు మండలం శ్రీరామవరం గ్రామానికి చెందిన వరి దుర్గారావు(43) శుక్రవారం పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చోళ్ళ మండలి బ్యాంక్ అనే ఫైనాన్స్ సంస్థలో దెందులూరు గ్రామానికి చెందిన కానిస్టేబుల్ ఏడుకొండలు అనే వ్యక్తి వరి దుర్గారావుకు మధ్యవర్తిగా ఉండి అప్పుగా రూ.3 లక్షలు ఇప్పించి తాను మరో మూడు లక్షలు తీసుకుని రూ.6 లక్షలు దుర్గారావే తీసుకునట్లు బ్యాంక్‌కు పత్రాలు ఇచ్చారు. ఏడుకొండలు ఊరు వదిలి వెళ్లిపోవడం వలన ఫైనాన్స్ సంస్థ శ్రీరామవరంలోని దుర్గారావు ఇంటిని స్వాధీనం చేసుకుని ఇల్లు ఖాళీ చేయించింది. దీనితో మనస్తాపానికి గురైన దుర్గారావు ఇంట్లో పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడని కుటుంబ సభ్యులు తెలిపారు. గమనించిన కుటుంబ సభ్యులు ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసిన అవుట్ పోస్టు పోలీసులు దెందులూరు పోలీసులకు సమాచారం అందించారు.

అంగన్‌వాడీ టీచర్ మృతి

చింతలపూడి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి నగర పంచాయతీ సుప్రియన్‌పేట అంగన్‌వాడీ సెంటర్‌లో టీచర్‌గా పని చేస్తున్న కందిపాం వరలక్ష్మీ(61) విధి నిర్వహణలో గుండె పోటు రావడంతో ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్ష చేసిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్టు నిర్ధారించారు. ఆమెకు భర్త, పిల్లలు ఎవరూ లేరు. మేనల్లుడి వద్దే ఉంటుంది. ఆమె కుటుంబాన్ని సీఐటీయూ, సీపీఎం నాయకులు ఆర్.వి.సత్యనారాయణ, నత్తా వెంకటేశ్వరరావు పరామర్శించి సంతాపం తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

ఏలూరు క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఓ కోచింగ్ సెంటర్‌కు వచ్చే ఆడ పిల్లలు పడే విధంగా సీసీ కెమెరాలు పెట్టి ఇమేజ్‌లు క్యాప్చర్ చేస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఏలూరు ఆర్‌ఆర్‌పేలోని రంగూన్‌మేడ వీధిలో న్యాయవాది రత్నరాజు ఉంటున్నారు. ఆయన ఓ కోచింగ్ సెంటర్‌ను కూడా అక్కడే నడుపుతున్నారు. రత్నరాజు పక్కింటి వారితో పాత గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కోచింగ్ సెంటర్‌కు వచ్చే ఆడపిల్లలు పడే విధంగా వాళ్ళ పక్కకు కనబడేలా సీసీ కె మెరాలను ఏర్పాటు చేసి ఇమేజ్‌లను కూడా క్యాప్చర్ చేశారు. కులం పేరుతో ఆయన్ను దూషించారు. అప్పటి నుంచి అలా వేధింపు లకు పాల్పడుతున్నారు. చివరకు బాధితుడు పోలీసులను ఆశ్రయించడంతో ఈ చర్యలకు పాల్పడిన దువ్వి రెడ్డి జయహారిక, ఘంటా బాను కిరణ్, ఘంటా రామ్మోహన్‌లపై శుక్ర వారం ఏలూరు టూటౌన్ పోలీసులు ఐటీ యాక్టుతో పాటు, ఎస్సీ ఎస్టీ సెక్షన్‌లపై కేసు నమోదు చేశారు.

కల్వర్టుపై పడి యువకుడి మృతి

కామవరపుకోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. తడికలపూడి పోలీసుల కథనం ప్రకారం కామవరపుకోట మండలంలోని రామన్నపాలెంకు చెందిన మిరియాల వంశీ(26) గురువారం రాత్రి ద్విచక్రవాహనంపై కామవరపుకోటకు బయలుదేరాడు. మద్దిపాటివారిగూడెం వచ్చేసరికి ద్విచక్రవాహనం అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని కల్వర్టుపైపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతి చెందిన వంశీ సోదరి గొన్నూరు సదా ఫిర్యాదు మేరకు తడికలపూడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆక్యుపంక్చర్ వైద్యంతో దీర్ఘకాల వ్యాధుల నివారణ

నరసాపురం టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆక్యుపంక్చర్ వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులను నివారించవచ్చని మాజీ ఎమ్మెల్యేలు బండారు మాధవనాయుడు, కొత్తపల్లి జానకి రామ్ అన్నారు. మహిళా సమైక్య భవనంలో రాయల్, వశిష్ఠ క్లబ్ ఆధ్వర్యంలో ఆక్యుపంక్చర్ వైద్య శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ శిబిరంలో 100 మంది రోగులకు వైద్యులు పరీక్షలు చేశారు. డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ, జక్కం బాబ్జీ, ఆరేటి మృత్యుంజయ, కోపల్లి శ్రీను, పణి, గుగ్గిలపు బుజ్జి, అందే కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు ట్రస్టు ఆసుపత్రికి ప్రత్యేక వైద్యుల రాక

పెంటపాడు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అలంపురం ట్రస్టు ఆసుపత్రికి ఈ నెల 6న హైదారాబాద్ నుంచి ప్రముఖ షుగర్ స్పెషలిస్టు డాక్టర్ రాజశేఖర్ వస్తున్నట్లు ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెద కృష్ణంరాజు తెలిపారు. షుగరు, పాదాలలో తిమ్మిర్లు, మంటలు, స్పర్శ తగ్గడం, రక్తప్రసరణ తగ్గడం, మానని పుండ్లు, తదితర వ్యాధులకు చికిత్స అందిస్తారన్నారు. అవసరమైన వారికి మరుసటి రోజు ఆదివారం ఆపరేషన్ కూడా చేయడం జరుగుతుందని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ముత్యాలపల్లి ఉన్నత పాఠశాల వద్ద ధర్నా నిర్వహిస్తున్న గ్రామస్తులు

పాఠశాలకు ఆట స్థలం కేటాయించాలని ధర్నా

మొగల్తూరు, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు ఆటస్థలం కేటాయించాలని కోరుతూ శుక్రవారం గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. గతంలో ఉన్నత పాఠశాల లేకపోవడంతో బండి ముత్యాలమ్మ అలయ నిధులతో పాఠశాలను నడిపేవారని, అనంతరం జడ్పీ స్వాధీనం చేసుకుందన్నారు. పాఠశాలకు ఆట స్థలం కోసం 5 ఎకరాలు కేటాయించారన్నారు. స్థలం ఆక్రమణలకు గురికావడంతో పాఠశాలకు స్వాధీనం చేయలేదన్నారు. ఆట స్థలం కేటాయించాలని మెగా పేరెంట్స్ మీటింగ్ సందర్భంగా డిమాండ్ చేశారు. ఆరోగ్యవర్షిణి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన అవసరం



అవగాహన కార్యక్రమంలో డీఎస్పీ శ్రీవేద

నరసాపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని డీఎస్పీ శ్రీవేద అన్నారు. శుక్రవారం డీఎస్పీ కార్యాలయం వద్ద స్వర్ణాంధ్ర విద్యార్థులకు చట్టాలు, హక్కులు, విధులపై అవగాహన కల్పించారు. డీఎస్పీ మాట్లాడుతూ యువత లక్ష్యాన్ని ఎంచుకుని దాన్ని సాధించే దిశగా కృషి చేయాలన్నారు. ర్యాగింగ్, చెడు వ్యసనాలు, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. బైక్ నడిపే ప్రతి ఒక్కరూ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. విద్యార్థులతో పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో సీఐ దుర్గాప్రసాద్, ఎస్సైలు వాసు, నాగలక్ష్మి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూ

నరసాపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): సబ్ కలెక్టర్ కార్యాలయంలో టీచర్లు, ఆయా పోస్టులకు శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూ నిర్వహించారు. ఆర్డీవో దాసిరాజు, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి ఇంటర్వ్యూలు చేశారు. పాలకొల్లు, పెనుమంట్ర, మొగల్తూరు సెక్టర్ పరిధిలోని 52 ఆయా పోస్టులకు 128 మంది, రెండు టీచర్ పోస్టులకు 12 మంది హాజరయ్యారు. ఎంపికైన వారికి త్వరలో సమాచారం అందిస్తామని ఆర్డీవో తెలిపారు. కార్యక్రమంలో సీడీపీవో ఊర్మిళ, కృష్ణకుమారి, ఉమా తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేయాలి

పెనుగొండ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): బీసీ ఉద్యమ శక్తిని మరింత బలపరిచేదిశగా పని చేయాలని బీసీ చైతన్య వేదిక అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాస్ అన్నారు. పెనుగొండలో వేండ్ర రాము అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా మార్ని సూర్య ప్రసాద్, గౌరవాధ్యక్షుడిగా సత్యం, ప్రధాన కార్యదర్శిగా శీలం శేఖర్, ఉపాధ్యక్షులుగా నౌడు అప్పారావు, ఆచంట నియోజకవర్గ అధ్యక్షుడుగా వేండ్ర రామును నియమించారు. బీసీలకు గౌరవం, హక్కులు, అవకాశాలు సంపాదించడం కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామన్నారు. యువతకు నాయకత్వ అవకాశాలు కల్పించేదిశగా కమిటీ కట్టుబడి పని చేస్తుందన్నారు. జిల్లా కార్యదర్శి బొక్కా శ్రీనివాస్, కుడిపూడి శ్రీనివాస్, మండా ప్రసాద్, బాలం సత్తిరాజు, తదితరులు పాల్గొన్నారు.

రూటు మార్చిన రేషన్ మాఫియా

(5వ పేజీ తరువాయి)

గరిష్ఠంగా కిలో రూ.15 లకు కొంటున్నారు. అదే బియ్యం ఇతర దేశాలకు కిలో రూ.40కు అమ్ముడుపోతోంది. గతంలో కాకినాడ వ్యాపారుల వద్దకు రేషన్ బియ్యమంతా చేరేది. ఇప్పుడు తూర్పు గోదావరి జిల్లాకు తరలివెళుతోంది.

రేషన్ బియ్యమే గిట్టుబాటు

గతంలో తూర్పు గోదావరి, కాకినాడ జిల్లాలకు చెందిన మిల్లర్లు జిల్లా నుంచి ధాన్యం కొనుగోలు చేసేవారు. తాడేపల్లిగూడెం, తణుకు మండలాల్లో ఇతర దేశాల్లో డిమాండ్ వున్న రకాలను పండిస్తుంటారు. ఇటీవల విదేశాలకు ఎగుమతులు గిట్టుబాటు కావడం లేదంటూ ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. లేదంటే ప్రభుత్వ మద్దతు ధరకంటే అధికంగా చెల్లించి కొనుగోలు చేసేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. ఇతర జిల్లాల మిల్లర్లు జిల్లాలోని ధాన్యం కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదు. అంతా ప్రభుత్వానికి అమ్మకాలు సాగిస్తున్నారు. ఫలితంగా ఇతర దేశాలకు ఎగుమతి చేయాలన్నా, రీసైక్లింగ్ చేయాలన్నా రేషన్ బియ్యం గిట్టుబాటు అవుతోంది. వీటిపైనే వ్యాపారులు ఎక్కువగా ఆధారపడుతున్నారు. ఎగుమతులు చేస్తున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

(5వ పేజీ తరువాయి)

ఏపీ 39 యుఎన్ 8128 నంబర్ గల మరో వ్యాను ఆపగా వ్యానులో 50 క్వింటాళ్ల రేషన్ బియ్యం గుర్తించి, డ్రైవర్ కుడిపూడి సూర్య దుర్గా గణేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. నరసాపురానిక చెందిన అధికారి ఏసు నరసాపురం పరిసర ప్రాంతాల్లో కొనుగోలు చేసి నాగేంద్రరెడ్డికి విక్రయిస్తున్నట్టు తెలిపాడు. రూ.2లక్షల విలువ కలిగిన బియ్యం, రూ.5.47 లక్షల విలువైన వాహనం సీజ్ చేశారు. గణేష్, అధికారి ఏసు, గుడిమెట్ల నాగేంద్రరెడ్డి, వ్యాను ఓనర్ ప్రతివాడ లక్ష్మీదుర్గలపై కేసు నమోదు చేశారు. మార్టేరులో ఏపీ 39 టిఎక్స్ నంబర్ వ్యాను ఆపి 35 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు. డ్రైవర్ జక్కంశెట్టి శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా అత్తిలికి చెందిన ఇర్రి గౌరీశంకర్ పరిసర ప్రాంతాల్లో కిలో రూ.18 కొని రూ.20కు అమ్మేందుకు రవాణా చేస్తున్నట్లు తెలిపాడు. లక్షా 40వేల విలువ కలిగిన బియ్యం, రూ 4.26లక్షల విలువైన వాహనం సీజ్ చేసి శ్రీనివాస్, గౌరీశంకర్, వ్యాను ఓనర్ బాదరాల నాగరాజులపై కేసు నమోదు చేశారు. విజిలెన్సు సీఐ నాగరాజు, రెవెన్యూ, పౌర సరఫరా అధికారులు పెనుమంట్ర డీటీ ఏలియమ్మ, వీఆర్వోలు పాల్గొన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని సమీప చౌక్ డిపో డీలర్లకు అప్పగించారు.

నేడు నరసాపురం కౌన్సిల్ అత్యవసర సమావేశం

నరసాపురం టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్యాలయంలో శనివారం కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ అంజయ్య తెలిపారు. చైర్‌పర్సన్ వెంకటరమణ అధ్యక్షతన ఉదయం 11గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు.

నేడు ఉపాధ్యాయులకు ఆటల పోటీలు

నరసాపురం రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్ బిచర్ల జడ్పీహైస్కూల్ ప్రాంగణంలో శనివారం ఉపాధ్యాయులకు ఆటలు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో పుష్పరాజ్యం తెలిపారు. మహిళ ఉపాధ్యాయులకు త్రోబాల్, పురుషులకు క్రికెట్ టీం సెలక్షన్ జరుగుతుందన్నారు. ఆసక్తి గలవారు ఉదయం 10గంటలకు మైదానంలో ఉండాలని ఆమె కోరారు.


రేలంగి పాఠశాల విద్యార్థులకు బహుమతులు ఇస్తున్న ఎమ్మెల్యే రాధాకృష్ణ


ఆకివీడు ఉన్నత పాఠశాల విద్యార్థులతో జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి


భీమవరం మునిసిపల్ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజిబాబు

విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు : మంత్రి నిమ్మల

పోడూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు పాలనలోనే టీచర్ నియామకాలు జరిగాయని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. జిన్నూరు హైస్కూల్‌లో శుక్రవారం జరిగిన పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ ఐదేళ్ల పాలనలో ఒక్క టీచర్ పోస్ట్ కూడా ఇవ్వకుండా విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేశాడని విమర్శించారు. తమ ప్రభుత్వం విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిందన్నారు. విద్యార్థుల్లో సత్‌ప్రవర్తనకు తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని ఆయన సూచించారు. విద్యార్థులు ఏర్పాటుచేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను మంత్రి సందర్శించారు. విద్యార్థులతో కలిసి మంత్రి రామానాయుడు మధ్యాహ్న భోజనం చేశారు. హెచ్‌ఎం సీహెచ్.శివజ్యోతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ జమ్ము బేబీ మహాలక్ష్మి, ఎంపీపీ సబ్బితి సుమంగళి, దేవళ్ల ప్రసాద్, దాసరి రత్నరాజు, దేవళ్ల శ్రీరామకోటిమోహన్, ఉన్నమట్ల కబర్ధి, యర్రంశెట్టి పద్మారావు, కుక్కల సత్యనారాయణ, పెన్మెత్స కాశీవిశ్వనాథ రాజు, గుబ్బల శ్రీరామ్, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకోవాలి : జేసీ

ఆకివీడు/కాళ్ల/పాలకోడేరు/ఉండి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యం నిర్దేశిం చుకుని ముందుకు వెళ్లాలని జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి సూచించారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో పేరెంట్స్ మీట్‌లో ఆయన మాట్లాడారు. పదవ తరగతి విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమక్షంలో విద్యా ప్రమాణాలు గురించి, భవిష్యత్తులో విద్యార్థులు ఏమి కావాలనుకుంటున్నారో అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. పిల్లలు ఎలా చదువుతున్నారు, ఏమి చేస్తున్నారు ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు గమనించాలన్నారు. విద్యార్థులు, పేరెంట్స్‌తో కలిసి భోజనం చేశారు. ఏపీసీ ఎం.శ్యామ్‌సుందరం, ఎంఈవో రవీంద్ర, హెచ్‌ఎం పారానాయుడు, విద్యా కమిటీ చైర్మన్ బొర్రా వెంకటేశ్వరమ్మ, ఏఎంసీ చైర్మన్ బొల్లా వెంకట్రావు, గంధం ఉమా, ఎంపీఎస్ నాగమణి, తహసీల్దార్ ఫరూఖ్, ఆర్ఐ ఆంజనేయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

కాళ్ల మండలంలోని కాళ్ల, దొడ్డనపూడి, కోపల్లె, కలువపూడి, ఏలూరుపాడు, పెద అమిరం, జువ్వలపాలెం, మాలవానితిప్ప, బొండాడ, వేంపాడు, సీసలి తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ శుక్రవారం పండుగ వాతావరణంలో నిర్వహించారు. తహసీల్దార్ జి.సుందర్‌సింగ్, ఆరేటి వెంకటరత్న ప్రసాద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు. పాలకోడేరు మండలం వేండ్ర ఉన్నత పాఠశాలలో సర్పంచ్ కడలి నాగేశ్వరి, హెచ్‌ఎం జీవీవీ శ్రీనివాస్, విద్యా కమిటీ చైర్మన్ కడలి వెంకట ఫణికుమార్, విస్సాకోడేరు ఉన్నత పాఠశాలలో గాదం నానాజీ, ఆరేపల్లి నాగలక్ష్మి, రామయ్య, తాడికొండ నాగేంద్ర, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. ఉండి కాపులపేట పాఠశాలలో హెచ్‌ఎం దీనాకుమారి, గురుగుబిల్లి వెంకట సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలు పిల్లలను తీర్చిదిద్దే దేవాలయాలు

భీమవరం రూరల్/టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పాఠశాలలు మన పిల్లలను తీర్చిదిద్దే దేవాలయాలని, ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులూ బాధ్యత తీసుకోవాలని ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు అన్నారు. ఝూన్సీలక్ష్మీబాయి మునిసిపల్ హైస్కూల్‌లో మెగా పేరెంట్స్ మీట్‌లో ఆయన మాట్లాడారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులకు పతకాలు అందించారు. హెచ్‌ఎం కృష్ణకుమారి, గంటా త్రిమూర్తులు, ఇందుకూరి రామలింగరాజు, కొప్పినీడి బాబి, యర్రంశెట్టి శివకృష్ణ, యర్రంశెట్టి లక్ష్మణ్, కారుమూరి సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు. పీఎస్‌ఎం బాలికోన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మి,

పాఠశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్

మెంటే పార్థసారథి, ఎండి నౌషాద్, ఎండి షబీనా, మద్దుల రాము, చెల్లబోయిన గోవింద్, గొలగాని రమేష్, గనిరెడ్డి త్రినాథ్, పాల్గొన్నారు. వీరవాసరం పాఠశాలలో మాజీ మంత్రి పీతల సుజాత విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఎంపీపీ దుర్గాభవాని, ఆర్డీవో దాసి రాజు పాల్గొన్నారు.

భీమవరం మండలం గూట్లపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో కలెక్టర్ నాగరాణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తల్లిదండ్రులు అప్పులు చేసి ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి కలెక్టర్ భోజనం చేశారు. హెచ్‌ఎం పి.సత్యవాణి పాఠశాల విద్యార్థులు సాధించిన ప్రగతి, ఉత్తీర్ణత శాతం వివరించారు. డీఈవో ఇ.నారాయణ జిల్లా విద్యాశాఖ ప్రగతిని సభలో వివరించారు. కె.రాంబాబు, సాంబ, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో విద్యావ్యవస్థ బలోపేతం

ఇరగవరం/తణుకు రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థను బలోపేతం చేసిందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. రేలంగి జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ దేశంలోనే అత్యుత్తమ విద్యా విధానాన్ని అమలు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. స్కూలు డైనింగ్ హాలును ప్రారంభించిన ఎమ్మెల్యే రాధాకృష్ణ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. తణుకు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో మునిసిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ మాట్లాడారు. డిప్యూటీ ఎంపీడీవో ఎస్.నరసింహమూర్తి, టి.రామబ్రహ్మం, సీఐఎస్ కొండయ్య, కూటమి నాయకులు తాతపూడి మారుతీరావు, కొమ్మిరెడ్డి శ్రీనివాసు, బొల్లాడ నాగరాజు, ఎస్ఎంసీ చైర్మన్ వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. వేల్పూరు పాఠశాలలో సర్పంచ్ పెనుమర్తి వెంకటలక్ష్మి, తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్‌వర్మ, వల్లూరి రామ్మోహన్, ఎస్ఎంసీ చైర్మన్ శిరీష, కోరా సత్యనారాయణ, దువ్వ పాఠశాలలో ఏఎంసీ చైర్మన్ కొండేటి శివ, ఎస్.నరసింహమూర్తి, ముళ్లపూడి నారాయణరావు, పెనుమాక అశోక్, ఎస్.వెంకటేశ్వరరావు, బొరుసు నాగు, కట్టా సూర్యారావు పాల్గొన్నారు.

విద్యతో సమాజంలో గౌరవం

నరసాపురం టౌన్/మొగల్తూరు, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): పట్టణ, మండలంలో స్కూళ్లు, గురుకుల పాఠశాలల్లో మెగా పేరెంట్స్ డే పండుగ వాతావరణం లో జరిగింది. విద్యార్థుల తల్లిదండ్రులు ఆత్మీయ సమ్మేళానికి పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బీసీ గురుకుల పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్‌డే కార్యక్రమానికి మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు, అగ్నికులక్షత్రీయ సాధికార కమిటీ కన్వీనర్ కొప్పాడ రవి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విద్య సమాజంలో గౌరవాన్ని పెంచుతుందన్నారు. లెనిన్ హైస్కూల్‌లో పొత్తూరి రామరాజు, వైఎస్‌పాలెం హైస్కూల్‌లో సర్పంచ్ వైఎస్ నాగముత్యాలంబ, ఎంపీవో పుష్పరాజ్యం, బాబులు, వాసు, హెచ్ ఎం కె.శ్రీనివాస్, ఏఈ పావని పాల్గొన్నారు. మొగల్తూరు మండలంలోని పాఠశాలల్లో హెచ్‌ఎంలు, సర్పంచ్‌లు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు సహకరించాలి

పెనుగొండ/ఆచంట/పెనుమంట్ర, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పిల్లల భవిష్యత్‌కు తల్లిదండ్రుల సహకారం ముఖ్యమని తహసీల్దార్ జి.అనిత కుమారి అన్నారు.మండలంలోని పాఠశాలల్లో మెగా పేరెంట్స్ మీట్ నిర్వహించారు. బీఆర్ అంబేడ్కర్ బాలికల పాఠశాల విద్యార్థులకు తహసీల్దార్ సూచనలు చేశారు. చినమల్లం పాఠశాలలో సర్పంచ్ చిట్టూరి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన పూర్వ విద్యార్థులను సత్కరించారు. సిద్ధాంతం సర్పంచ్ చింతపల్లి గనరాజు, ఎం.వెంకటేశ్వరరావు, బి.ఏడుకొండలు, పొదల సుమన్, మానుపాటి భవాని, కుక్కల భువనేశ్వరి పాల్గొన్నారు.

ఆచంట మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్ సమావేశాలు జరిగాయి. ఆచంట ఉన్నత పాఠశాలలో పితాని వెంకట్, జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, తమ్మినీడి ప్రసాద్, కేతా మీరయ్య, జవ్వాది బాలాజీ, కేతా మురళి, మండల ప్రత్యేకాధికారి పిచ్చయ్య, కరుగోరుమిల్లిలో ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి, జడ్పీటీసీ సురేష్‌బాబు, సర్పంచ్ అల్లం పద్మావతి పాల్గొన్నారు. వేమవరం, కొడమంచిలి, వల్లూరు తదితర పాఠశాల్లో సర్పంచ్‌లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. పెనుమంట్ర మండలం పొలమూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక అధికారి బి.దేవీ స్వరూపదేవి సర్పంచ్ కాకర రాజేశ్వరరావు, ఆళ్ల రాము హెచ్‌ఎం బీఎస్ సరస్వతి పాల్గొన్నారు.

విద్యార్థులు చదువులో రాణించాలి

పెంటపాడు/తాడేపల్లిగూడెం రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు చదువులో రాణించాలని డీపీవో ఎస్.రామచంద్రరెడ్డి అన్నారు. పెంటపాడు డీఆర్ గోయింకా ప్రభుత్వ జూనియర్ కళాశాల, పలు పాఠశాలల పేరెంట్స్ మీట్‌లో ఆయన మాట్లాడారు. చదువుతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రిన్సిపాల్ ఎంవీ.దేవరాజు, ఎంఈవోలు శ్రీనివాస్, టీవీ రామకృష్ణ, సర్పంచ్ తాడేపల్లిసూర్యకళ, కిలపర్తి వెంకట్రావు, కసిరెడ్డి మధులత, కార్యదర్శి బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురంలో ఎస్ఎంసీ చైర్మన్ అరిగల వెంకటకృష్ణ మాట్లాడుతూ క్వాలిఫైడ్ ఉపాధ్యాయుల శిక్షణలో విద్యార్థులు మెరికల్లా తయారవుతున్నారన్నారు. సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక, ఎస్ఎంసీ సభ్యులు సత్యాల సతీష్, హెచ్‌ఎం ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు. నవాబుపాలెంలో సర్పంచ్ మద్దుకూరి గంగాభవాని ధనరాజు, కృష్ణాయపాలెంలో సర్పంచ్ బెదపూడి వెంకట సుబ్బలక్ష్మి, ఉపసర్పంచ్ బేదపూడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మండలంలోని పాఠశాలల్లో సమావేశాలు నిర్వహించారు.

గణపవరం: మండలంలోని జల్లికొమ్మర జడ్పీ పాఠశాలలో తహసీల్దార్ వైకేవీ.అప్పారావు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. పిప్పర ఉన్నత పాఠశాలలో ఉప సర్పంచ్ ఐవీ నరసింహరాజు, ఎంఈవో బాలయ్య, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. మొయ్యేరు పాఠశాలలో కానుమిల్లి చంటి, ఎండీ శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు, ఎం.సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు. గణపవరం చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

విద్య ద్వారా సమాజాభివృద్ధి

యలమంచిలి/పాలకొల్లు అర్బన్/పాలకొల్లు టౌన్, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): విద్య ద్వారా సమాజాభివృద్ధి సాధ్యమని జడ్పీ మాజీ చైర్మన్ కొక్కిరిగడ్డ జయరాజు అన్నారు. ఊటాడ ప్రాథమిక పాఠశాలలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విలువలతో కూడిన విద్యనభ్యసించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ బుడితి జయరాజు తదితరులు పాల్గొన్నారు. పాలకొల్లు పట్టణంలోని అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో శుక్రవారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. పాఠశాలలతో పాటు జూనియర్, డిగ్రీ కళాశాలల్లో సమావేశాలకు తల్లిదండ్రులు తరలివచ్చారు.

ఆర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు


నరసాపురంలో వినతుల స్వీకరణ

భీమవరంటౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రజల అర్జీలను స్వీకరించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అర్హులందరికీ అన్ని పథకాలను అందుతాయన్నారు. చలమల చంద్రశేఖర్, బండి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: టీడీపీ కార్యాలయంలో మత్స్యకార అభివృద్ధి చైర్మన్ కొల్లు పెద్దిరాజు, ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణలతో కలిసి టీడీపీ ఇన్‌చార్జి రామరాజు గ్రీవెన్స్ నిర్వహించారు. ప్రజల నుంచి 764 వినతులు స్వీకరించారు. వాటిలో 730 వినతులు ఇంటి స్థలాల కోసమే వచ్చాయి. కొప్పాడ రవి, పాలూరి బాబ్జీ, సంకు భాస్కర్, వాతాడి ఉమా, రాజ్యలక్ష్మి, మౌలాలీ, ఆనంద్, బుంగా రమేష్, చిన్నాయమ్మ పాల్గొన్నారు.

పెంచలయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

భీమవరం టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): హత్యకు గురైన నెల్లూరు జిల్లా సీపీఎం నేత పెంచలయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం పట్టణ కమిటీ ప్రభుత్వాన్ని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ధర్నాలో బి.బివాసుదేవరావు మాట్లాడుతూ గంజాయి వ్యాపారానికి అడ్డు తగులుతున్నాడని హతమార్చడం దారుణమన్నారు. డి.కళ్యాణి, ఎం.వైకుంఠరావు, చల్లబోయిన వెంకటేశ్వరరావు, కురిటి సోమేశ్వరరావు, సంసేను నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణకు లయన్స్ సేవలు : ఎమ్మెల్సీ వంక

అత్తిలి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): లయన్స్ సేవా సంస్థ ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తోందని మాజీ గవర్నర్ ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ అన్నారు. బల్లిపాడులో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్యాన్సర్ నిర్ధారణ పరీక్ష శిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. క్యాన్సర్ ప్రాథమిక దశలోనే గుర్తిస్తే నయం చేసుకోవచ్చు అన్నారు. శిబిరం దాత ఆకుల రామచంద్రరావు, డాక్టర్ ప్రవల్లిక, డాక్టర్ అబ్దుల్ రహమాన్, డాక్టర్ మాన్విత, కో ఆర్డినేటర్ బిందు మాట్లాడారు. వంకా రాజకుమారి, బాలకృష్ణ, వర్ధినీడి వెంకట శివ, కసిరెడ్డి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

కొండయ్య చెరువు గట్టుపై అక్రమ కట్టడాలు

తాడేపల్లిగూడెం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొండయ్య చెరువు గట్టుపై అక్రమ కట్టడాలు, నిర్మాణాలను నిలుపుదలచేయాలని స్థానికులు శుక్రవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గత నెల 13న చెరువు గట్టున నిర్మాణం జరుగుతుందని మునిసిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రభుత్వం స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టవద్దని వినతిపత్రంలో కోరారు.

మహిళలకు క్యాన్సర్‌పై అవగాహన ఉండాలి

వీరవాసరం(భీమవరం టౌన్), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మహిళలు సర్వైకల్, బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని కొల్లా భాస్కరమ్మ, శ్రీ వీర రాఘవులు మెమోరియల్ ట్రస్టు సభ్యురాలు ఆకుల మౌనిక తెలిపారు. వీరవాసరంలో నెల రోజులుగా మహిళలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ట్రస్టు సభ్యులు కొండ్రెడ్డి నారాయణ్, గిరీష్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు.

బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు


ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల ఎన్నో అనర్థాలు తలెత్తుతాయని, బాల్య వివాహాలు చేయరాదని సీడీపీవో టీఎల్ సరస్వతి అన్నారు. పట్టణంలోని మాగంటి అన్నపూర్ణాదేవి మునిసిపల్ హైస్కూల్‌లో బాల్య వివాహ ముక్త్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిజ్ఞ చేయించారు. సూపర్‌వైజర్‌లు దుర్గాభవాని, విశాలాక్షి, మహిళా పోలీస్ గౌషియాబేగం, హెచ్‌ఎం ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

దేవస్థానాల అభివృద్ధికి పాటుపడాలి

ఆకివీడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దేవస్థానాలు అభివృద్ధికి పాలకవర్గం పాటుపడాలని మోటుపల్లి రామవరప్రసాద్, ఏఎంసీ చైర్మన్ బొల్లా వెంకట్రావు అన్నారు. మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ రామశాస్త్రి, సభ్యులకు శుక్రవారం నియామక పత్రాలు అందజేశారు. ఈనెల 7న ప్రమాణస్వీకారం జరుగుతుందన్నారు. టీడీపీ, జనసేన పట్టణ అధ్యక్షులు గంధం ఉమా, పిల్లా బాబులు, ఎంపీఎస్ నాగమణి, దేవస్థానం ఈవో అల్లూరి సత్యనారాయణరాజు, మాజీ సర్పంచ్ గొంట్లా గణపతి, కూటమి నేతలు ఉన్నారు.

గ్రామాభివృద్ధికి దాతల సహకారం


నిర్మాణంలో ఉన్న గ్రామ ముఖద్వారం

కాళ్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని పెద అమిరం సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు తెలిపారు. పెద అమిరంలోని ఆదినాథ్ జైన్ భగవాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.10 లక్షలతో నిర్మిస్తున్న గ్రామ ముఖద్వారం పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఇప్పటికే డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు సహకారంతో గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు.

కనకలక్ష్మి ఆలయ అభివృద్ధికి సహకరించండి

తాడేపల్లిగూడెం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కనకలక్ష్మి ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కోరారు. పట్టణంలోని 11వ వార్డులో కనకలక్ష్మి ఆలయ వార్షికోత్సవంలో ఆయన పూజలు చేశారు. అమ్మవారి ఆశీస్సులు పట్టణ ప్రజలపై ఉండాలన్నారు. కమిటీ సేవలను ఎమ్మెల్యే కొనియాడారు. కమిటీ అధ్యక్షుడు కాళ్ల గోపికృష్ణ కార్యదర్శి యాదాల శివాజీనాయుడు, బొర్రా మురళీధర్, సభ్యులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు 'ఫ్రైడే డ్రైడే'

ఇరగవరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ వై.నాగబాబు అన్నారు. మండలంలోని గోటేరు గ్రామంలో జరుగుతున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. దోమల నిర్మూలనకు చర్యలు చేపట్టడంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం కీలకం అన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ గుడిమెట్ల వెంకటేశ్వరరావు, ఉప ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సామాజిక అధికారి ఇంద్రాణి, గ్రామ ఆరోగ్య కార్యదర్శి డి.పద్మకుమారి, ఆశా కార్యకర్తలు జి.శుభ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్లడ్ గ్రూపింగ్ పరీక్షలు

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు శుక్రవారం బ్లడ్ గ్రూపింగ్ పరీక్షలను నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్లు 1, 2, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి, కళాశాల పూర్వ విద్యార్థి కొమ్ముల మురళీకృష్ణ శిబిరాన్ని ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎం.రామకృష్ణ, వి.విజయలక్ష్మి, అధ్యాపకులు బూసి వెంకటస్వామి, పిజ్యోష్ణశ్రీ, బికెవి రామలక్ష్మి, హెప్సీరాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

గణపవరం: గణపవరం చింతలపాటి మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో శుక్రవారం విద్యార్థులకు బ్లడ్‌గ్రూపు పరీక్షలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి తెలిపారు. విద్యార్థులకు బ్లడ్‌గ్రూపు అవశ్యకత, ఆరోగ్యంపై సూచనలు ఇచ్చామని ప్రిన్సిపాల్ తెలిపారు.

సంక్షిప్త సమాచారం..

- **నరసాపురం రూరల్ :** సీతారాంపురం నుంచి పేరుపాలెం రహదారి నిర్మాణానికి ప్రభుత్వం రూ.30లక్షలు కేటాయించింది. శుక్రవారం రోడ్డుపై గోతులు పూడ్చి తారు వేశారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్ పరివేక్షిస్తున్నారు. ఈ పనులు నాలుగైదు రోజుల్లో పూర్తి చేస్తామన్నారు.
- **పాలకొల్లు అర్బన్ :** యడ్ల బజారులోని కనక దుర్గమ్మను శుక్రవారం వందలాది మంది భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. 800 మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. ఆలయ ఈవో ఎన్.సతీష్ కుమార్, చైర్మన్ తులా రామలింగేశ్వరరావు, ట్రస్టీలు సిబ్బంది చిట్టి రాంబాబు, సత్యనారాయణ, అర్చకులు ఎం వెంకట రమణ పాల్గొన్నారు.
- **పెనుగొండ :** వాసవి శాంతి ధామ్ క్షేత్రంలో బాపట్ల జిల్లా రేపల్లె గ్రామానికి చెందిన అమ్మాణి వాసవి మాతకు యాలకులతో తయారు చేసిన హారం శుక్రవారం సమర్పించారు. హారం అమ్మవారికి అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- పెనుగొండ మండలం చెరుకువాడ విశ్వేశ్వరస్వామి దేవస్థానానికి తణుకు పట్టణానికి చెందిన కర్రి వెంకట రమాసూర్రెడ్డి 0.0970సెంట్లు భూమి అందజేశారు. భూమి దస్తావేజును సజ్జాపురం సబ్ రిజిస్ట్రార్ ఎ.కృష్ణంరాజు సమక్షంలో ఆలయ ఈవో డి.పుష్పబానుకు అందజేశారు.
- **పెంటపాడు :** పరిమెళ్ల చిన కాపవరం అభయాంజనేయస్వామి విగ్రహం వద్ద సామూహిక హనుమద్ వ్రతాలు నిర్వహించారు. భారీ అన్నసమారాధన జరిపారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు.
- **తాడేపల్లిగూడెం :** పర్యావరణ పరిరక్షణలో మొక్కల పాత్ర కీలకమని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పేరిచర్ల మురళీకృష్ణంరాజు అన్నారు. వరల్డ్ ఎర్త్‌డే కార్యక్రమం పేరిచర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. పేరిచర్ల వీరభద్రరాజు, తమ్మాబత్తుల సత్యనారాయణ, ఆకుల సుబ్రహ్మణ్యం, పెనుమత్స రాజగోపాలరాజు తదితరులు పాల్గొన్నారు.
- **తణుకు రూరల్ :** విపశ్యన ధ్యాన శిక్షణ తరగతులను ఈనెల 7న ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాలలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ జరుగుతుందన్నారు. గతంలో పది రోజుల పాటు విపశ్యన ధ్యాన శిక్షణ పూర్తి చేసిన వారు పాల్గొనవచ్చని తెలిపారు.
- **యలమంచిలి :** మండలంలోని బూరుగుపల్లిలో పశువుల దాణా పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు మామిడిశెట్టి పెద్దిరాజు, నాయకులు పాడి రైతులకు పశువుల దాణా అందజేశారు. బూరుగుపల్లి, కంచుస్తంభంపాలెం గ్రామాల్లో 5 టన్నుల పశువుల దాణా అందజేశామని మండల పశువైద్యాధికారి పి.చంద్రశేఖరరెడ్డి తెలిపారు.